www.epaper.asthramdaily.com

RNI : TGTEL/25/A1872

సామాన్యుడి అస్త్రం

తెలుగు దిన పత్రిక

సంగారెడ్డి- హైదరాబాద్ | శుక్రవారం,అక్టోబర్02,2026 | ఎడిటర్: పి. జయరాం | సంపుటి: 1 | సంచిక:208 | పేజీలు: 8 | వెల: రూ.5/-

నాలుగేళ్ల వేటకు తెర..

జమ్మూకశ్మీర్‌లో భద్రతా దళాలు భారీ విజయాన్ని నమోదు చేశాయి. లష్కరే తోయిబా (ఎల్‌ఈటీ) సంస్థకు చెందిన సీనియర్ కమాండర్ మూసా అలియాస్ ఆసిఫ్ ఫౌజీని మంగళవారం బుద్గాం జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మట్టుబెట్టాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత సోషల్ మీడియాలో వైరల్ అయిన ఒక ఫొటోలోని నలుగురు కీలక కమాండర్ల ముఠాలో మూసా చివరివాడు. తాజా ఎన్‌కౌంటర్‌తో ఆ నలుగురు ఉగ్రవాదుల ఏరివేత పూర్తయినట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది.బుద్గాం జిల్లాలోని ఖాన్‌సాహిబ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గురువత్‌కలాన్ ప్రాంతంలో మూసా కదలికలపై భద్రతా దళాలకు పక్కా గూఢచార సమాచారం అందింది. దీంతో టెక్నికల్, హ్యూమన్ ఇంటెలిజెన్స్ ఆధారంగా జమ్మూకశ్మీర్ పోలీసులు, భద్రతా దళాలు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టాయి.

కరువు పరిస్థితులపై ప్రత్యేక కార్యాచరణ..

- ఉద్యోగులకు శుభవార్త.. రెండు డీఏలు మంజూరు
- రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు..
- ఎల్‌నినో ప్రభావంపై కేబినెట్ ఆందోళన


ధాన్యం కొనుగోళ్లు, విద్యుత్ ప్రణాళికలు, సాగునీటి ప్రాజెక్టులపై చర్చ

హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)

రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు డీఏలు మంజూరు చేయడంతో పాటు రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, ధాన్యం కొనుగోళ్లు, విద్యుత్ డిమాండ్, కొత్త విద్యుత్ ప్రాజెక్టులు, పెండింగ్ ప్రాజెక్టులపై కేబినెట్ విస్తృతంగా చర్చించింది. ఆర్థిక భారం ఉన్నప్పటికీ ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీ మేరకు డీఏలు విడుదల చేయాలని నిర్ణయించింది.

ఉద్యోగులకు రెండు డీఏలు.. పెన్షనర్లకు డీఆర్ మంజూరు

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు రెండు డీఏలు (కరువు భత్యాలు) ఇచ్చేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 2024 నుంచి పెండింగ్‌లో ఉన్న డీఏల్లో రెండు విడతలను వెంటనే మంజూరు చేయాలని నిర్ణయించింది. అప్పటి నుంచి బకాయిపడిన ఎరియర్స్‌ను దశలవారీగా వాయిదాల్లో చెల్లించనున్నారు. ఉద్యోగ సంఘాలతో ఇటీవల జరిగిన చర్చల్లో ఇచ్చిన



హామీ మేరకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. డీఏలు, డీఆర్‌ల అమలుతో ప్రతి సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వంపై సుమారు రూ.2,500 కోట్ల ఆర్థిక భారం పడనుంది.

ఎల్‌నినో ప్రభావంపై కేబినెట్ ఆందోళన

రాష్ట్రంలో 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటుపై మంత్రివర్గం సుదీర్ఘంగా చర్చించింది. ఈ వానాకాలంలో రాష్ట్రంలో సాధారణం కంటే దాదాపు 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వివరించారు.రుతుపవనాల కాలం ముగియడంతో పరిస్థితిని సమీక్షించిన కేబినెట్.. దాదాపు 235 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నట్లు గుర్తించింది.


అరకును గ్లోబల్ కాఫీ డెస్టినేషన్‌గా

తీర్చిదిద్దుతాం

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

- అరకును గ్లోబల్ కాఫీ డెస్టినేషన్‌గా మార్చేందుకు పెట్టుబడులు
- ప్రపంచ కాఫీ పటంలో ఏపీకి సరైన స్థానం కల్పిస్తామన్న చంద్రబాబు

- గిరిజనుల శ్రమ, తూర్పు కనుమల సౌరభం అరకు కాఫీ అన్న పవన్ కల్యాణ్
- అరకు కాఫీని ప్రధాని మోదీ కూడా ప్రశంసించారని గుర్తు చేసిన పవన్
- అంతర్జాతీయ కాఫీ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన నేతలు



అమరావతి(సామాన్యుడి అస్త్రం)

అరకును ప్రపంచ స్థాయి కాఫీ కేంద్రంగా (ప్రీమియర్ గ్లోబల్ కాఫీ డెస్టినేషన్) తీర్చిదిద్దేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రియాశీలకంగా పెట్టుబడులు పెడుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అంతర్జాతీయ కాఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఉదయం ఒక కప్పు కాఫీ తాగనిదే కోట్లాది మందికి రోజు ప్రారంభం కాదని, తన దినచర్య కూడా అరకు కాఫీతోనే మొదలవుతుందని చంద్రబాబు 'ఎక్స్' వేదికగా తెలిపారు. "అరకు.. ఆంధ్రప్రదేశ్ ఘనమైన వారసత్వ సంపదకు ప్రతీక. మన రాష్ట్రంలోని కొండ ప్రాంతాల నుంచి ప్రపంచ వ్యాప్తంగా కాఫీ కప్పుల వరకు అరకు కాఫీ సాగించిన అద్భుత ప్రయాణాన్ని ఈ అంతర్జాతీయ కాఫీ దినోత్సవం రోజున జరుపుకుందాం" అని ఆయన పేర్కొన్నారు. స్థానిక రైతులను ప్రోత్సహిస్తూ, ప్రపంచ కాఫీ పటంలో ఆంధ్రప్రదేశ్‌కు సరైన స్థానం కల్పించడమే తమ లక్ష్యమని చంద్రబాబు వివరించారు.

ఇచ్చిన హామీలు పక్కనపెట్టి కొత్త వివాదాలు

- శివుడు, రాముడిపై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం
- దేవుళ్లను కూడా రాజకీయాల్లోకి లాగడంపై కిషన్ రెడ్డి అభ్యంతరం

హైదరాబాద్(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పరమేశ్వరుడు పేదల దేవుడని, శ్రీరాముడు ధనికుల దేవుడని సీఎం చేసిన వ్యాఖ్యలు మతం పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించేలా ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ విమర్శలు చేశారు.ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలతో ఏకంగా దేవుళ్లను కూడా రాజకీయాల్లోకి లాగారని కిషన్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. శివుడు, రాముడి పేర్లతో చేసిన ఈ వ్యాఖ్యలు యావత్ హిందూ సమాజాన్ని అవమానించేలా ఉన్నాయని, హిందువుల మధ్య అనవసర గొడవలు పెట్టే ప్రయత్నమని అన్నారు.



ఉపఎన్నికలో బీజేపీ
గెలుపు ఖాయం

టికెట్ అడిగే హక్కు నాకుంది: బీజేపీ నేత చింతల

హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)



ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి జరగబోయే ఉపఎన్నికలో బీజేపీ టికెట్‌ను ఆశించే హక్కు తనకుందని, అక్కడ పార్టీ గెలుపు ఖాయమని బీజేపీ సీనియర్ నేత చింతల రామచంద్రారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడటంతో ఖాళీ అయిన ఈ స్థానంపై ఆయన తన ఆసక్తిని స్పష్టం చేశారు.

బీఎస్ఎన్ఎల్
బంపర్ ఆఫర్

ఈ రెండు ప్లాన్లతో రూ.1 లక్ష బీమా కవరేజీ

న్యూఢిల్లీ,(సామాన్యుడి అస్త్రం)



ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్), తన కస్టమర్లను ఆకట్టుకునేందుకు ఒక వినూత్నమైన ఆఫర్‌తో ముందుకొచ్చింది. ఎంపిక చేసిన రెండు ప్రీపెయిడ్ ప్లాన్‌లపై లక్ష రూపాయల వరకు ఉచిత బీమాతో పాటు సైబర్ ఫ్రాడ్ కవరేజీని అందిస్తున్నట్లు ప్రకటించింది.

గచ్చిబౌలి హోటల్‌లో
వ్యభిచారం గుట్టురట్టు

- నిర్వాహకులు, విటుడితో పాటు ముగ్గురు ఉజ్బెక్ యువతులు అరెస్ట్
- విశ్వసనీయ సమాచారంతో హోటల్‌పై పోలీసుల దాడి



హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)

హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఓ హోటల్‌ను కేంద్రంగా చేసుకుని విదేశీ యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు గచ్చిబౌలి పోలీసులు గత రాత్రి ఆ హోటల్‌పై దాడి చేసి, నిర్వాహకులతో పాటు ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ముగ్గురు యువతులను అరెస్ట్ చేశారు.ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ముగ్గురు యువతులను కూడా అదుపులోకి తీసుకున్నారు.



వయోవృద్ధులు నవసమాజ నిర్మాణంలో
పాత్రధారులు

- ఘనంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం
- సంక్షేమ సంస్థలకు అవార్డులు ప్రదానం చేసిన మంత్రులు పొన్నం, అడ్లూరి

హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)

వయోవృద్ధులు సమాజంలో భాగస్వాములు మాత్రమే కాదని, వారు నవ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించే నిర్మాతలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. వారి అనుభవం, ఆలోచనలు కుటుంబంతో పాటు రాష్ట్రాభివృద్ధికి ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గురువారం రవీంద్రభారతి ప్రాంగణంలో తెలంగాణ ప్రభుత్వ దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం-2026' వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎస్సీ సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

2027 వన్డే వరల్డ్ కప్ షెడ్యూల్
విడుదల

- 2027 క్రికెట్ ప్రపంచ కప్ పూర్తి షెడ్యూల్‌ను ప్రకటించిన ఐసీసీ
- దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్త ఆతిథ్యం
- అక్టోబర్ 7న ఆస్ట్రేలియాతో భారత్ తొలి మ్యాచ్
- అక్టోబర్ 10న జోహన్నెస్‌బర్గ్‌లో భారత్-పాకిస్థాన్ మెగా ఫైట్



ఇంటర్నెట్ న్యూస్, అక్టోబర్1

ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐసీసీ పురుషుల క్రికెట్ వన్డే ప్రపంచకప్ 2027 షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) గురువారం విడుదల చేసింది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నమెంట్ సరికొత్త ఫార్మాట్‌తో అభిమానులను అలరించనుంది. 2023 ఫైనల్‌కు పునరావృతంగా, అక్టోబర్ 7న కేప్‌టౌన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాతో భారత్ తన తొలి మ్యాచ్ ఆడనుంది.ఈ టోర్నమెంట్‌లో మొత్తం 14 జట్లు పాల్గొంటాయి. అయితే, గ్రూప్ స్టేజ్‌కు మాత్రం 12 జట్లే అర్హత సాధిస్తాయి. ఆతిథ్య దేశాలుగా దక్షిణాఫ్రికా, జింబాబ్వే నేరుగా అర్హత పొందాయి. వీటితో పాటు, 2026 సెప్టెంబర్ 30 నాటికి ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్-8లో నిలిచిన జట్లు కూడా నేరుగా క్వాలిఫై అవుతాయి. దీంతో మొత్తం 10 జట్లు ఖరారవుతాయి.

శంషాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిపై సహోద్యోగి దాడి

- విమానాశ్రయం నుంచి కారులో కిడ్నాప్ చేసిన సహోద్యోగి
- మార్గమధ్యలో చితకబాది కిందకు తోసేసిన వైనం

హైదరాబాద్,అక్టోబర్ 1(సామాన్యుడి అస్త్రం)

హైదరాబాద్‌లో ఘోరం జరిగింది. ప్రేమను నిరాకరించిందన్న నెపంతో ఓ యువకుడు, తన సహోద్యోగి అయిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిపై దాడికి తెగబడ్డాడు. శంషాబాద్ విమానాశ్రయం పరిధిలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది.ఝార్ఖండ్‌కు చెందిన 25 ఏళ్ల యువతి మాదాపూర్‌లో నివసిస్తూ, నగరంలోని ఓ ప్రముఖ ఐటీ సంస్థలో మేనేజర్‌గా



పనిచేస్తోంది. అదే సంస్థలో పనిచేసే ఆకాశ్ అనే యువకుడు గత ఏడాది కాలంగా ఆమెను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు.

ఉపఎన్నిక నోటిఫికేషన్ ఆపండి

- నోటిఫికేషన్ నిలిపివేయాలని కోరుతూ విజయారెడ్డి పిటిషన్
- కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రతివాదులకు ఆదేశం

హైదరాబాద(సామాన్యుడి అస్త్రం)



ఖైరతాబాద్ శాసనసభ నియోజకవర్గ ఉపఎన్నిక నోటిఫికేషన్ జారీ చేయకుండా భారత ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణను తెలంగాణ హైకోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. దివంగత మాజీ మంత్రి పి. జనార్దన్ రెడ్డి కుమార్తె విజయారెడ్డి ఈ మేరకు ఉన్నత న్యాయస్థానంలో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు.

కరువు పరిస్థితులపై ప్రత్యేక కార్యాచరణ..

మొదటి పేజి తరువాయి

కరువు మండలాల ప్రకటనతో పాటు రాష్ట్రానికి తగిన సాయం అం దించాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర మంత్రివర్గం విజ్ఞప్తి చేసింది. త్వరలోనే మంత్రుల బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర పరిస్థితిని నివేదిస్తాం. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తారు. ఈ సీజన్‌లో దాదాపు 65 లక్షల మెట్రిక్ టన్ను ల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని పౌర సరఫరాల విభాగం అంచనా వే సింది. కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని మంత్రివర్గం అధికారులకు సూచించింది. ఎల్ నినో పరిస్థితులతో రాష్ట్రంలో విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరిగింది. రాష్ట్రంలో సాధారణంగా ఒక్క రోజుకు 15,000 మెగావాట్ల విద్యుత్తు వినియోగం ఉండగా.. ఈ సీజన్‌లో బుధవారం అది రికార్డు స్థాయిలో 19,892 మెగావాట్ల పీక్ డిమాండ్‌కు చేరింది. అంటే దాదాపు 20 వేల మెగావాట్లకు చేరింది. గత ఏడాది మొ త్తంలో 16,613 మెగావాట్ల గరిష్ట వినియో గం నమోదైంది. అందుకే విద్యుత్తు డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్తు ఉత్పత్తి, తగినం త విద్యుత్తు



సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్తు కోత లేకుండా సరఫరా చేసేందుకు అవసరమైనంత విద్యుత్తును సమకూర్చుకోవాలని, డిమాండ్ మేరకు కొనుగోలు చేయాలని నిర్ణయించింది.భవిష్యత్తు డిమాండ్, అవసరాలను దృష్టిలో పెట్టుకొని కొత్తగా పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి, విద్యుత్తు సమీకరణపై దృష్టి పెట్టాలని నిర్ణయించింది. దాదాపు 7,800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యంగా యూనిట్లు నెలకొల్పేందుకు ఆమోదం తెలిపింది. ఇందులో 3,000 మెగావాట్ల సోలార్ విద్యుత్తు, 4,000 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్, 800 మెగావాట్ల పవన విద్యుత్తు యూనిట్ల ఏర్పాటు ప్రతిపాదనలపై మంత్రివర్గం చర్చించింది. కేంద్ర నిబంధనల మేరకు బిడ్డింగ్ విధానంలో ఈ ప్రాజెక్టులు చేపట్టాలని నిర్ణ యించింది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో వరల్డ్ క్లాస్ ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని నిర్ణయం తీసుకుంది. పూర్తిగా ప్రభుత్వ నిధులతోనే ఈ మార్కెట్ ఏర్పాటు చేయాలని క్యాబినెట్ సూచించింది.దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పున:సమీక్షించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఈపీసీ విధానంలో చేపట్టిన ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉంటే రద్దు చేయాలని అధికారులను ఆదేశించింది. ఇందులో భాగంగా 10 ఈపీసీ సాగునీటి ప్రాజెక్టులను నిలిపివేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.తెలంగాణలో డిజిటల్ మీడియా అడ్వర్టై జింగ్‌కు ప్రత్యేక పాలసీ అమలుచేసే ప్రతిపాదనను మంత్రివర్గం పరిశీలించింది. కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ రూపొందించిన డిజిటల్ అడ్వర్టైజ్‌మెంట్ పాలసీకి అనుగుణంగా రాష్ట్రంలో ఈ పాలసీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ పోస్టు మంజూరుకు కేబినేట్ ఆమోదం తెలిపింది. మరో నలుగురు గ్రూప్ 1 అధికారులను కూడా ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున పనిచేసేందుకు నియమించాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది.

ఇచ్చిన హామీలు పక్కనపెట్టి కొత్త వివాదాలు

మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలతో ఏకంగా దేవుళ్లను కూడా రాజకీయాల్లోకి లాగారని కిషన్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. శివుడు, రాముడి పేర్లతో చేసిన ఈ వ్యాఖ్యలు యావత్ హిందూ సమాజాన్ని అవమానించేలా ఉన్నాయని, హిందువుల మధ్య అనవసర గొడవలు పెట్టే ప్రయత్నమని అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కనపెట్టి, ఇలాంటి కొత్త వివాదాలను ముందుకు తెస్తోందని ఆరోపించారు. ప్రజలను విభజించడం కాంగ్రెస్ పార్టీకి ఎప్పటినుంచో ఉన్న అలవాటు అని ఆయన వ్యాఖ్యానించారు.ఈ సందర్భంగా కిషన్ రెడ్డి ఒక సవాల్ విసిరారు. “హిందూ దేవుళ్లపై మాట్లాడిన విధంగా ఇతర మతాల దేవుళ్ల గురించి మాట్లాడే ధైర్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉందా?” అని ఆయన ప్రశ్నించారు.

ఉపఎన్నికలో బీజేపీ గెలుపు ఖాయం

మొదటిపేజీ తరువాయి

- ఖైరతాబాద్ టికెట్ ఆశించే హక్కు తనకు ఉందన్న చింతల రామచంద్రారెడ్డి

- దానం పార్టీ మారగానే శాసనసభ్యత్వం రద్దు చేయాల్సిందని వ్యాఖ్య

దానం నాగేందర్ పార్టీ మారి మరో పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేసినప్పుడే ఆయన శాసనసభ్యత్వం రద్దు చేయాల్సిందని చింతల అభిప్రాయపడ్డారు. దానం అనర్హత కోసం బీజేపీ హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు న్యాయపోరాటం చేసిందని, చివరికి తమ ప్రయత్నాలు ఫలించాయని ఆయన అన్నారు.తెలంగాణలో బీజేపీ 8 ఎంపీ స్థానాలతో పాటు, గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలను కూడా గెలుచుకుందని, అదే స్ఫూర్తితో ఖైరతాబాద్‌లోనూ విజయం సాధిస్తామని చింతల అన్నారు. “అభ్యర్థిని పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుంది. కానీ టికెట్ అడిగే హక్కు నాకుంది. ఇతరులు కూడా అడగవచ్చు. నేను ఎప్పుడూ ఖైరతాబాద్‌ను విడిచిపెట్టలేదు. పార్టీ అవకాశం ఇస్తే కచ్చితంగా పోటీ



చేసి గెలుస్తాను” అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

వయోవృద్ధులు నవసమాజ నిర్మాణంలో పాత్రధారులు

మొదటిపేజీ తరువాయి

వయోవృద్ధుల సంక్షేమం, సేవ కోసం కృషి చేస్తున్న పలు స్వచ్ఛంద సంస్థలు, ప్రతినిధులకు మంత్రులు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. వయోవృద్ధులను సమాజానికి మార్గదర్శకులుగా గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అవసరమైతే చట్టాల్లో నిబంధనలు మార్చి అయినా సరే వయోవృద్ధులకు పూర్తి రక్షణ కల్పిస్తామన్నారు. వీరికి సీనియర్ సిటిజన్ బస్‌పాస్‌లు ఇవ్వాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని మంత్రి తెలిపారు.వారి శారీరక, మానసిక ఆరోగ్యం కోసం 30 డే కేర్ కేంద్రాల్లో ఉచితంగా పౌష్టికాహారం, వైద్య సేవలు అందిస్తున్నామని వివరించారు. వృద్ధుల సంరక్షణలో నైపుణ్యం కోసం 1,700 మందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అత్యవసర సహాయం కోసం 14567 (ఎల్డర్ లైన్) సేవలందిస్తోందన్నారు. భరణం, ఆస్తి వివాదాలకు సంబంధించిన ట్రిబ్యునల్ కేసులను సులభతరం చేసి, పెద్ద సంఖ్యలో వాటిని పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వారికి కొండంత భరోసానిస్తాయని స్పష్టం చేశారు. వృద్ధుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న వివిధ సంస్థలకు మంత్రి పొన్నం ప్రభాకర్తో ఆయన అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో కొందరు వయోవృద్ధులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో మైండ్ రీ ఫ్రెష్ అవుతుందని వారు అభిప్రాయపడ్డారు.

అరకును గ్లోబల్ కాఫీ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దుతాం

మొదటిపేజీ తరువాయి

ఇదే సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా అంతర్జాతీయ కాఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అరకు కాఫీ విశిష్టతను వివరిస్తూ, “ప్రతి కప్పు అరకు కాఫీలో తూర్పు కనుమల సౌరభం, అక్కడి నేల సారం, మన గిరిజన రైతుల కఠోర శ్రమ ఇమిడి ఉన్నాయి” అని అన్నారు.అరకు కాఫీ కేవలం రుచి, సువాసనలకు మాత్రమే పరిమితం కాదని, అది మన అడవులు, గిరిజన సంఘాలు, వారి సంప్రదాయ జ్ఞానం మధ్య ఉన్న బంధానికి ప్రతీక అని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందుతున్న ఈ స్థానిక ఉత్పత్తి, అరకు లోయల నుంచి ఢిల్లీలోని పార్లమెంట్ వరకు ప్రయాణించిందని, అక్కడ ప్రత్యేక స్టాళ్ల ద్వారా ప్రదర్శించబడిందని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా అరకు కాఫీని, దాని సాగుతో ముడిపడి ఉన్న గిరిజన కుటుంబాల కృషిని పలుమార్లు ప్రశంసించారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.”ఒక కప్పు అరకు కాఫీ అంటే మన నేల రుచి, మన ప్రజల కథ, మన తూర్పు కనుమల సువాసన” అని పవన్ కల్యాణ్ అభివర్ణించారు. మొత్తంగా, అంతర్జాతీయ కాఫీ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర నాయకత్వం అరకు కాఫీకి ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకురావాలనే తమ సంకల్పాన్ని పునరుద్ఘాటించింది.

ఉపఎన్నిక నోటిఫికేషన్ ఆపండి.

మొదటిపేజీ తరువాయి

విజయారెడ్డి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, 2024 ఎన్నికల్లో దానం నాగేందర్ విజయాన్ని సవాల్ చేస్తూ తమ క్లయింట్ దాఖలు చేసిన ఎలక్షన్ పిటిషన్ ఇంకా కోర్టులో పెండింగ్‌లో ఉందని గుర్తుచేశారు. ఆ ఎన్నికల అఫిడవిట్‌లో దానం నాగేందర్ తప్పుడు సమాచారం ఇచ్చారని ఆయన ఆరోపించారు. ఈ పాత పిటిషన్‌పై తుది తీర్పు వెలువడే వరకు ఖైరతాబాద్ ఉపఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయకుండా నిలిపివేయాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు.వాదనలు విన్న హైకోర్టు, ఈ పిటిషన్‌పై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది. కోర్టు తాజా నిర్ణయంతో ఖైరతాబాద్ ఉపఎన్నిక ప్రక్రియపై ప్రస్తుతానికి ఉత్కంఠ నెలకొంది.

శంషాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిపై సహోద్యోగి దాడి

మొదటిపేజీ తరువాయి

ఝార్ఖండ్‌కు చెందిన 25 ఏళ్ల యువతి మాదాపూర్‌లో నివసిస్తూ, నగరంలోని ఓ ప్రముఖ ఐటీ సంస్థలో మేనేజర్‌గా పనిచేస్తోంది. అదే సంస్థలో పనిచేసే ఆకాశ్ అనే యువకుడు గత ఏడాది కాలంగా ఆమెను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. నిందితుడి వేధింపులు భరించలేక బాధితురాలు గతంలోనే మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, అప్పట్లో అతను వెనక్కి తగ్గాడు.ఈ నేపథ్యంలో, ఢిల్లీలోని బంధువుల ఇంటి నుంచి విమానంలో తిరిగి వస్తున్న ఆమెను శంషాబాద్ విమానాశ్రయం వద్ద ఆకాశ్ అడ్డగించాడు.

గచ్చిబౌలి హోటల్‌లో వ్యభిచారం గుట్టురట్టు.

మొదటిపేజీ తరువాయి

నిందితుల నుంచి నగదు, మొబైల్ ఫోన్లు స్వాధీనం

కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న గచ్చిబౌలి పోలీసులు

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఢిల్లీకి చెందిన నిఖిల్ ప్రధాన నిర్వాహకుడిగా వ్యవహరిస్తూ, రామ్మోహన్ రెడ్డి అనే వ్యక్తితో కలిసి ఈ అసాంఘిక కార్యకలాపాలను నిర్వహిస్తున్నాడు. పక్కా సమాచారంతో పోలీసులు హోటల్‌పై మెరుపు దాడి నిర్వహించి, నిర్వాహకులు నిఖిల్, రామ్మోహన్ రెడ్డితో పాటు విటుడు హర్షిత్ సింఘానియాను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ముగ్గురు యువతులను కూడా అదుపులోకి తీసుకున్నారు.ఘటనా స్థలం నుంచి పోలీసులు రూ. 13,000 నగదు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో పట్టుబడిన యువతుల పాస్‌పోర్టులు, వీసాలు చెల్లుబాటులోనే ఉన్నాయని, వారు కొద్ది రోజుల క్రితమే నగరానికి వచ్చినట్లు తేలింది. ఈ ఘటనపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి, ఈ ముఠా వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

జీఎస్టీ వసూళ్లలో భారీ జంప్..



మొదటిపేజీ తరువాయి

తొలి 6 నెలల్లో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.12,46,278 కోట్లకు

గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 11.6 శాతం వృద్ధి

అక్టోబర్ 7న జరగనున్న జీఎస్టీ కౌన్సిల్ సమావేశం

ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ (ఐజీఎస్టీ) వసూళ్లు రూ.1,20,396 కోట్లుగా నమోదయ్యాయి. సెటిల్‌మెంట్ల తర్వాత నికర జీఎస్టీ ఆదాయం 18.1 శాతం పెరిగి రూ.1,76,520 కోట్లకు చేరింది.దేశీయంగా వసూలైన జీఎస్టీ ఆదాయం కూడా పెరిగింది. సెప్టెంబరులో ఇది 10.1 శాతం వృద్ధితో రూ.1,37,996 కోట్లకు చేరింది. దిగుమతులపై వసూలైన జీఎస్టీ ఆదాయం పెరగడం మొత్తం వసూళ్ల వృద్ధికి ప్రధానంగా దోహదం చేసింది.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు తొలి ఆరు నెలల్లో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.12,46,278 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 11.6 శాతం వృద్ధి నమోదైంది.అక్టోబర్ 7న జరగనున్న జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పెద్దగా పన్ను రేట్ల మార్పులు ఉండకపోవచ్చని అధికార వర్గాలు తెలిపాయి. జీఎస్టీ 2.0లో భాగంగా ప్రక్రియల సరళీకరణ, ఈ-ఇన్వాయిసింగ్, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ నిబంధనలపై ప్రధానంగా చర్చ జరిగే అవకాశం ఉంది. గతంలో అమలు చేసిన పన్ను రేట్ల మార్పులు ఎలా పనిచేస్తున్నాయన్న అంశాన్ని కూడా కౌన్సిల్ సమీక్షించనుంది.

బీఎస్ఎన్ఎల్ బంపర్ ఆఫర్

మొదటిపేజీ తరువాయి

లక్ష రూపాయల వరకు ప్రమాద మరణ బీమా కవరేజ్

రూ.10,000 వరకు సైబర్ ఫ్రాడ్ నుంచి ఆర్థిక రక్షణ

ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీతో బీఎస్ఎన్ఎల్ భాగస్వామ్యం

అక్టోబర్ 1 నుంచి ఈ ఆఫర్ అమలులోకి!

దేశంలో ఒక టెలికాం ఆపరేటర్ రీఛార్జ్ ప్లాన్‌తో ఉచిత బీమాను అందించడం ఇదే తొలిసారని బీఎస్ఎన్ఎల్ పేర్కొంది.

ఈ ఆఫర్ కోసం బీఎస్ఎన్ఎల్, ప్రముఖ ప్రభుత్వ రంగ బీమా సంస్థ అయిన ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం, అర్హత కలిగిన ప్లాన్‌లతో రీఛార్జ్ చేసుకున్న చందాదారులకు లక్ష రూపాయల వరకు ప్రమాద మరణ బీమా లభిస్తుంది. దీనితో పాటు, బీఎస్ఎన్ఎల్ నంబర్ ఉపయోగించి జరిగిన ఆన్‌లైన్ మోసాల నుంచి రక్షణగా రూ.10,000 వరకు సైబర్ ఫ్రాడ్ కవరేజీని కూడా అందిస్తున్నారు.

ప్లాన్లు ఇవే:

కస్టమర్లు ఈ బీమా ప్రయోజనాలను పొందాలంటే రెండు ప్రత్యేక టారిఫ్ వోచర్ల లో ఒకదానితో రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది.

202: 30 రోజుల వ్యాలిడిటీతో వచ్చే ఈ ప్లాన్‌పై 300 నిమిషాల వాయిస్ కాల్స్, 5 +దీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లతో పాటు ఉచిత బీమా, సైబర్ కవర్ లభిస్తాయి.

2449: 365 రోజుల వ్యాలిడిటీ గల ఈ వార్షిక ప్లాన్‌తో అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 2 +దీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు, ఉచిత బీమా సదుపాయం అందుబాటులో ఉంటాయి.

కస్టమర్ రీఛార్జ్ చేసిన వెంటనే బీమా పాలసీ యాక్టివేట్ అవుతుంది. పాలసీకి సంబంధించిన వివరాలు రీఛార్జ్ కన్ఫర్మేషన్ ఎస్ఎంఎస్ ద్వారా యూజర్ కు అందుతాయి. ప్లాన్ వ్యాలిడిటీ ఉన్నంత కాలం ఈ బీమా కవరేజ్ వర్తిస్తుంది. ప్రైవేట్ టెలికాం కంపెనీల నుంచి తీవ్రమైన పోటీని ఎదుర్కొంటున్న తరుణంలో, అదనపు ప్రయోజనాలతో కస్టమర్లను నిలుపుకోవడానికి బీఎస్ఎన్ఎల్ ఈ వ్యూహాత్మక అడుగు వేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

ఖైరతాబాద్ ఉపఎన్నిక నోటిఫికేషన్ ఆపండి..



ఖైరతాబాద్ ఉపఎన్నిక నోటిఫికేషన్‌పై హైకోర్టులో విచారణ
నోటిఫికేషన్ నిలిపివేయాలని కోరుతూ విజయారెడ్డి పిటిషన్
దానం నాగేందర్ ఎన్నికపై వేసిన పాత పిటిషన్ పెండింగ్‌లో ఉందని వాదన
విచారణను మంగళవారానికి వాయిదా వేసిన న్యాయస్థానం
కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రతివాదులకు ఆదేశం

హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)

ఖైరతాబాద్ శాసనసభ నియోజకవర్గ ఉపఎన్నిక నోటిఫికేషన్ జారీ చేయకుండా భారత ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణను తెలంగాణ హైకోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. దివంగత మాజీ మంత్రి పి. జనార్దన్ రెడ్డి కుమార్తె విజయారెడ్డి ఈ మేరకు ఉన్నత న్యాయస్థానంలో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు.విజయారెడ్డి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, 2024 ఎన్నికల్లో దానం నాగేందర్ విజయాన్ని సవాల్ చేస్తూ తమ క్లయింట్ దాఖలు చేసిన ఎలక్షన్ పిటిషన్ ఇంకా కోర్టులో పెండింగ్‌లో ఉందని గుర్తుచేశారు. ఆ ఎన్నికల అఫిడవిట్‌లో దానం నాగేందర్ తప్పుడు సమాచారం ఇచ్చారని ఆయన ఆరోపించారు. ఈ పాత పిటిషన్‌పై తుది తీర్పు వెలువడే వరకు ఖైరతాబాద్ ఉపఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయకుండా నిలిపివేయాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు.వాదనలు విన్న హైకోర్టు, ఈ పిటిషన్‌పై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది. కోర్టు తాజా నిర్ణయంతో ఖైరతాబాద్ ఉపఎన్నిక ప్రక్రియపై ప్రస్తుతానికి ఉత్కంఠ నెలకొంది.

ఖైరతాబాద్ టికెట్ అడిగే హక్కు నాకుంది



అవకాశం ఇస్తే పోటీ చేస్తానంటున్న చింతల రామచంద్రారెడ్డి
టికెట్‌పై తుది నిర్ణయం పార్టీ అధిష్ఠానిదేదనని వ్యాఖ్య
దానం అనర్హతపై బీజేపీ న్యాయపోరాటం చేసిందని వ్యాఖ్య
ఉప ఎన్నికపై బీజేపీలో టికెట్ ఆశావహుల పోటీ

హైదరాబాద్,((సామాన్యుడి అస్త్రం)

ఖైరతాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నిక నేపథ్యంలో బీజేపీ నేత చింతల రామచంద్రారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఖైరతాబాద్ టికెట్ అడిగే హక్కు తనకు ఉందని స్పష్టం చేశారు. పార్టీ అధిష్ఠానం ఎవరిని అభ్యర్థిగా నిలబెట్టాలన్నది నిర్ణయిస్తుందని, తాను మాత్రం టికెట్ ఆశిస్తున్నానని చెప్పారు.దానం నాగేందర్ పార్టీ మారి కాంగ్రెస్ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన సమయంలోనే ఆయన ఎమ్మెల్యే పదవి రద్దు కావాల్సిందని చింతల అన్నారు. దానం అనర్హత కోసం బీజేపీ న్యాయపోరాటం చేసిందని తెలిపారు. హైకోర్టుతో పాటు సుప్రీంకోర్టులోనూ పోరాడామని చెప్పారు. తమ ప్రయత్నాల ఫలితంగానే దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడిందని పేర్కొన్నారు.దానం నాగేందర్ ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ టికెట్‌పై 2023లో ఎమ్మెల్యేగా గెలిచిన విషయం తెలిసిందే. ఆ తర్వాత 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. ఈ వ్యవహారంపై దాఖలైన పిటిషన్లను విచారించిన తెలంగాణ హైకోర్టు ఆయనను అనర్హుడిగా ప్రకటించింది. సుప్రీంకోర్టు కూడా హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. దీంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయింది.ఇదే సమయంలో ఖైరతాబాద్ ఉప ఎన్నికపై బీజేపీలో టికెట్ ఆశిస్తున్న నేతల సంఖ్య పెరుగుతోంది. చింతల రామచంద్రారెడ్డి గతంలో ఖైరతాబాద్ నుంచి ప్రాతినిధ్యం వహించారు. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు టికెట్ రేసుపై ఆసక్తిని పెంచాయి. అయితే అభ్యర్థి ఎంపికపై తుది నిర్ణయం పార్టీ నాయకత్వమే తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు.రాష్ట్రంలో బీజేపీ ఎనిమిది లోక్‌సభ స్థానాలు గెలిచిందని చింతల గుర్తుచేశారు.

ఎన్‌పీడీసీఎల్‌లో సౌర వెలుగులు..

మరో 200 మెగావాట్ల సౌర విద్యుత్ గ్రిడ్‌కు అనుసంధానం లక్ష్యం..
పీఎం కుసుమ్-ఏ కింద 18 సర్కిళ్లలో విస్తరణ

హైదరాబాద్.(సామాన్యుడి అస్త్రం)



పునరుత్పాదక ఇంధన రంగంలో తెలంగాణ ఉత్తర ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీ-జీఎన్‌పీడీసీఎల్) కీలక మైలురాయిని సాధించింది. పీఎం కుసుమ్-ఏ పథకం కింద సంస్థ పరిధిలోని 18 సర్కిళ్లలో కలిపి 100 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించినట్లు సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. రానున్న మూడు నుంచి నాలుగు నెలల్లో మరో 200 మెగావాట్ల సౌర విద్యుత్ సామర్థ్యాన్ని గ్రిడ్‌కు అనుసంధానం చేసి మొత్తం సామర్థ్యాన్ని 300 మెగావాట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.రైతుల భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు అవకాశం కల్పించడం ద్వారా విద్యుత్ ఉత్పత్తితో పాటు వారికి అదనపు ఆదాయ మార్గాలను కల్పించడమే పీఎం కుసుమ్-ఏ పథకం ఉద్దేశమని సీఎండీ పేర్కొన్నారు. రైతులు తమ భూముల్లో సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేసి, అదనంగా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసే అవకాశం ఉంటుందని తెలిపారు.ప్రస్తుతం మరో 200 మెగావాట్ల సౌర విద్యుత్ సామర్థ్యానికి సంబంధించిన పనులు వివిధ దశల్లో ఉన్నాయని వరుణ్‌రెడ్డి చెప్పారు. ఆయా ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసి నిర్దిష్ట గడువులోగా గ్రిడ్‌కు అనుసంధానం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సౌర విద్యుత్ విస్తరణతో రైతులకు అదనపు ఆదాయం లభించడంతో పాటు స్థానికంగా పునరుత్పాదక విద్యుత్ అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.సంప్రదాయ ఇంధన వనరులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు, పర్యావరణహిత విద్యుత్ వినియోగాన్ని పెంచేందుకు సౌర విద్యుత్ విస్తరణ దోహదపడుతుందని సీఎండీ తెలిపారు. రైతుల ఆర్థిక సాధికారత, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్, సంస్థ పునరుత్పాదక ఇంధన సామర్థ్య విస్తరణ లక్ష్యాలతో టీ-జీఎన్‌పీడీసీఎల్ ముందుకు సాగుతోందని చెప్పారు.పీఎం కుసుమ్-ఏ అమలులో 18 సర్కిళ్లకు చెందిన అధికారులు, ఇంజినీర్లు, సిబ్బంది సమస్వయంతో పనిచేసి 100 మెగావాట్ల మైలురాయిని సాధించారని వరుణ్‌రెడ్డి అభినందించారు. త్వరలో 300 మెగావాట్ల సౌర విద్యుత్ సామర్థ్యానికి చేరుకోవడం సంస్థ పునరుత్పాదక ఇంధన విస్తరణలో మరో కీలక ఘట్టంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

మంత్రి జూపల్లిని అడ్డుకున్న కళాకారులు

సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్
రవీంద్ర భారతిలో కళాకారుల ఆందోళన

ముషీరాబాద్, అక్టోబర్ 1



సాంస్కృతిక సారథిలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయా లని డిమాండ్ చేస్తూ కళాకారులు గురువారం రవీంద్రభారతిలో ఆందోళనకు దిగారు. కార్యక్రమానికి హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు(ను అడ్డుకుని తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. మంత్రి కాన్వాయ్ ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సాంస్కృతిక సారథిలో వెయ్యి ఉద్యోగాలను భర్తీ చేయాలని కళాకారులు డిమాండ్ చేశారు.ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ ఇవ్వాలని మంత్రిని కోరారు. ఎన్నో ఏళ్లుగా కళారంగాన్ని నమ్ముకుని జీవిస్తున్న తమకు ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నా మని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళా కళాకారులు కన్నీటి పర్యంతమై తమకు ఉద్యోగాలు కల్పించాలని మంత్రిని వేడుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేసి తమ కుటుంబాలకు భరో సా కల్పించాలని కోరారు. ఉద్యోగాల భర్తీపై స్పష్టమైన ప్రకటన వచ్చే వరకు తమ ఆందోళన కొనసాగిస్తామని కళాకారులు తెలిపారు.

నిజాంలు నీళ్లు తాగిన బావికి హైడ్రా పునరుజ్జీవం

- **పాతబస్తీలోని చారిత్రక బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు కింద ఉన్న పురాతన బావి**
- **సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో హైడ్రా ఆధ్వర్యంలో పునరుద్ధరణ పనులు ప్రారంభం**
- **నిజాంల కాలంలో ఔషధ గుణాలున్న నీటిని అందించిన బావిగా ప్రత్యేక గుర్తింపు**
- **వారసత్వ పరిరక్షణ, పర్యావరణ అభివృద్ధి లక్ష్యంగా ఈ ప్రాజెక్టు రూపకల్పన**

హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)



హైదరాబాద్ నగరం అంటే కేవలం కాంక్రీట్ జంగిల్ కాదు, అడుగడుగునా చారిత్రక వైభవానికి, సాంస్కృతిక వారసత్వానికి నిలువుటద్దం. ముఖ్యంగా పాతబస్తీ గల్లీల్లో తిరిగితే శతాబ్దాల నాటి కథలు మనల్ని పలకరిస్తాయి. అలాంటి ఓ అద్భుతమైన చారిత్రక కట్టడానికి ఇప్పుడు పునరుజ్జీవం లభిస్తోంది. శివరాంపల్లిలోని 356 ఏళ్ల నాటి బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువును ఇటీవలే పునరుద్ధరించి నగరానికి ఓ మణిహారంగా అందించిన 'హైడ్రా', ఇప్పుడు అదే చెరువు కింద ఉన్న ఓ పురాతన ఊట బావికి ప్రాణం పోస్తోంది. నిజాం నవాబులు సైతం ఔషధ గుణాలున్నాయని భావించి ఈ బావి నీరు తాగినట్టు చరిత్ర చెబుతోంది. అంతడి విశిష్టత కలిగిన ఈ బావి, కాలగర్భంలో కలిసిపోతున్న తరుణంలో హైడ్రా దీని పునరుద్ధరణకు శ్రీకారం చుట్టింది.

సీఎం ఆదేశాలతో వేగంగా అడుగులు

గత మార్చి 8వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువును ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఆ సమయంలోనే చెరువుకు ఆనుకుని ఉన్న ఈ చారిత్రక బావి ప్రాముఖ్యతను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీని చారిత్రక నేపథ్యాన్ని తెలుసుకున్న ముఖ్యమంత్రి, తక్షణమే బావిని పునరుద్ధరించాలని ఆదేశించారు. దీంతో హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు. చెరువు అభివృద్ధి పనులను విజయవంతంగా పర్యవేక్షించిన 'విమోస్ టెక్నోక్రాట్స్' సంస్థకే ఈ బావి పునర్నిర్మాణ బాధ్యతలను కూడా అప్పగించారు. ప్రస్తుతం పనులు శరవేగంగా జరుగుతుండగా, మరో రెండు, మూడు నెలల్లో ఈ బావి పూర్వ వైభవాన్ని సంతరించుకోనుంది.

ఘనమైన చరిత్ర.. మరుగునపడిన వైభవం

ఒకప్పుడు వంద ఎకరాల్లో విస్తరించిన బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు, కాలక్రమేణా కబ్జాలకు గురై కేవలం 4 ఎకరాలకు పరిమితమైంది. దీనిపై దృష్టి సారించిన హైడ్రా, హెచ్ఎండీఏ లెక్కల ప్రకారం 17 ఎకరాల భూమిని ఆక్రమణల నుంచి విడిపించి చెరువుకు జీవం పోసింది. ఈ చెరువు కింద 1.50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఊట బావికి కూడా అంతే ఘనమైన చరిత్ర ఉంది. మూడవ నిజాం సికందర్ జా పాలనలో (సుమారు 1770) ప్రధానమంత్రిగా ఉన్న నవాబ్ రుక్న్-ఉద్-దౌలా పేరు మీదుగా ఈ చెరువును నిర్మించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి.చెరువు పరిసరాల్లోని ఔషధ మొక్కల వేర్ల నుంచి ప్రవహించే నీరు, సహజ సిద్ధంగా వడపోతకు గురై ఈ బావిలోకి చేరేదని, అందువల్ల ఈ నీటికి అద్భుతమైన ఔషధ గుణాలుండేవని చరిత్రకారులు చెబుతారు. ఈ స్వచ్ఛమైన నీటిని నిజాం పాలకులు తాగేవారని, ఎడ్ల బండ్లపై సుదూర ప్రాంతాలకు, చివరకు లండన్‌కు కూడా తరలించినట్లు కథలు ప్రచారంలో ఉన్నాయి. కానీ కాలక్రమేణా ఈ బావి ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త, మట్టితో నిండిపోయి తన నీటి నిల్వ సామర్థ్యాన్ని పూర్తిగా కోల్పోయింది.

వారసత్వ సంపద పరిరక్షణే లక్ష్యం

హైడ్రా ఈ బావి పునరుద్ధరణను కేవలం ఒక కట్టడాన్ని బాగుచేయడంగా కాకుండా వారసత్వ పరిరక్షణ, పర్యావరణ అభివృద్ధి, ప్రజా ప్రయోజనం అనే మూడు అంశాల సమన్వయంగా భావిస్తోంది. నిర్లక్ష్యానికి గురైన ఈ చారిత్రక సంపదను తిరిగి ప్రజలకు అందించి, భవిష్యత్ తరాలకు నగర జల నిర్వహణ పద్ధతులపై అవగాహన కల్పించడమే తమ లక్ష్యమని హైడ్రా అధికారులు తెలిపారు. బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు, దాని కింద ఉన్న ఔషధ గుణాల బావి.. ఇవి హైదరాబాద్‌లోని ప్రకృతి ఆధారిత వైద్య విధానాలకు, నీటి సంరక్షణ జ్ఞానానికి నిలువెత్తు సాక్ష్యాలు. ఈ పునరుద్ధరణతో ఆనాటి వైభవాన్ని కళ్లకు కట్టినట్లు చూపించే ప్రయత్నం జరుగుతోంది.

తెలంగాణ ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త

ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ, డీఆర్ పెంచుతూ ప్రభుత్వ ఉత్తర్వులు
2024 నుంచి పెండింగ్‌లో ఉన్న డీఏల్లో రెండింటికి ఆమోదం
డీఏల పెంపు వల్ల ప్రభుత్వ ఖజానాపై రూ. 2,500 కోట్ల అదనపు భారం

హైదరాబాద్,అక్టోబర్ 1,(సామాన్యుడి అస్త్రం)

దసరా పండుగను పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. 2024 నుంచి పెండింగ్‌లో ఉన్న డీఏల్లో రెండింటికి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఉద్యోగులు, పెన్షనర్లకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ బకాయిలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈరోజు సమావేశమైన కేబినెట్ సానుకూల నిర్ణయం తీసుకుంది.మంత్రివర్గ సమావేశం ముగిసిన అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. కేబినెట్ తీసుకున్న నిర్ణయాలను వారు ఈ సందర్భంగా వివరించారు. రెండు డీఏల వల్ల ప్రభుత్వంపై సుమారు రూ. 2,500 కోట్ల అదనపు ఆర్థిక భారం పడుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.రాష్ట్రంలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగినట్లు మంత్రులు పేర్కొన్నారు. నిన్న ఒక్కరోజే 19,892 మెగావాట్ల విద్యుత్ వినియోగం నమోదైనట్లు వారు వెల్లడించారు. వాతావరణ శాఖ సమాచారం ప్రకారం నిన్నటితో వర్షాకాలం ముగిసిందని, ఈ ఏడాది సగటున 17 శాతం వర్షపాతం తక్కువగా నమోదైందని తెలిపారు. రాష్ట్రంలోని సుమారు 235 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, ఎల్ నినో ప్రభావంపై కేబినెట్ అత్యవసర నివేదికను సిద్ధం చేస్తోందని మంత్రులు వివరించారుకేంద్ర ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా 5,800 మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు టెండర్లు పిలవాలని కేబినెట్ నిర్ణయించినట్లు మంత్రులు వెల్లడించారు. వీటితో పాటు 'తెలంగాణ డిజిటల్ మీడియా అండ్ అడ్వర్టైజ్‌మెంట్ పాలసీ'కి కూడా రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని వారు పేర్కొన్నారు.

'సర్'లో భాగంగా 92 లక్షల మందికి నోటీసులు: తెలంగాణ ప్రధాన ఎన్నికల కమిషనర్

65 లక్షల మంది నోటీసులకు సమాధానం ఇచ్చారని వెల్లడి
ఖైరతాబాద్ నియోజకవర్గంలో 80 వేల మందికి నోటీసులు ఇచ్చామన్న సుదర్శన్ రెడ్డి
సర్ ప్రక్రియను పాడిగించే ఉద్దేశం లేదని స్పష్టీకరణ

హైదరాబాద్,అక్టోబర్ 1,(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణ రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా 92 లక్షల మందికి నోటీసులు ఇచ్చినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 80 వేల మందికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. వారిలో 20 శాతం మంది సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 92 లక్షల మందిలో 65 లక్షల మంది నోటీసులపై స్పందించినట్లు చెప్పారు.నోటీసులు అందిన వారి ఇళ్ల వద్దకు బీఎల్ఓలు వెళ్లి సంబంధిత పత్రాలను తీసుకుంటున్నారని పేర్కొన్నారు. నోటీసులు అందిన కుటుంబ సభ్యులు అందరూ అందుబాటులో ఉండవల్సిన అవసరం లేదని, ఒక్కరు ఉండి, మిగిలిన అందరి కుటుంబ సభ్యుల వివరాలు ఇస్తే సరిపోతుందని అన్నారు. సర్ ప్రక్రియను మరోసారి పొడిగించే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు.

పాలంలో మొదలైన ప్రయాణం.. ఒలింపిక్స్ బెర్త్ వరకు..
తెలంగాణ ఆర్చర్ చికిత సక్సెస్ జర్నీ!

జపాన్‌లో సత్తా చాటిన తెలంగాణ ఆర్చర్
తానిపర్తి చికిత
రెండు స్వర్ణాలు గెలిచి లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌కు అర్హత
తండ్రే తొలి కోచ్.. పాలంలోని గడ్డివామే తొలి టార్గెట్
కూతురి క్రీడా పరికరాల కోసం వరికోత యంత్రం అమ్మిన తండ్రి
అంతర్జాతీయ వేదికలపై పతకాలతో నిలకడైన ప్రదర్శన

హైదరాబాద్,అక్టోబర్ 1,(సామాన్యుడి అస్త్రం)



తెలంగాణకు చెందిన యువ ఆర్చర్ తానిపర్తి చికిత అంతర్జాతీయ వేదికపై సంచలనం సృష్టించింది. జపాన్‌లో జరిగిన పోటీల్లో అద్భుత ప్రదర్శన కనబరిచి ఏకంగా రెండు స్వర్ణ పతకాలు సాధించింది. ఈ విజయంతో ఆమె ప్రతిష్ఠాత్మక లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌కు బెర్త్ ఖరారు చేసుకుంది.

చికిత ప్రస్థానం స్ఫూర్తిదాయకం

పెద్దపల్లి జిల్లా సుల్తాన్‌పూర్ గ్రామ వాసి అయిన చికిత ప్రస్థానం ఎంతో స్ఫూర్తిదాయకం. ఆరేళ్ల వయసులో ఆమెను ఆర్చర్‌గా చూడాలని తండ్రి శ్రీనివాసరావు కల కన్నారు. గ్రామంలో సరైన వసతులు లేకపోవడంతో ఆయనే తొలి కోచ్‌గా మారారు. పొలంలో వరి కోతల తర్వాత మిగిలిన గడ్డివామునే లక్ష్యంగా చేసి చికితతో ప్రాక్టీస్ చేయించారు. ఖరీదైన విల్లు, క్రీడా పరికరాల కోసం తమ జీవనాధారమైన వరికోత యంత్రాన్ని అమ్మి, బ్యాంకులో రుణం తీసుకోవడం ఆయన త్యాగానికి నిదర్శనం. తండ్రి ప్రోత్సాహంతో జాతీయ సబ్-జూనియర్ పోటీల్లో రెండు పతకాలు గెలిచిన చికిత, నాలుగేళ్ల క్రితం సోనేపట్‌లోని సాయ్ ఆర్చరీ అకాడమీలో చోటు దక్కించుకుంది. అప్పటి నుంచి వెనుదిరిగి చూడలేదు. గత ఏడాది చైనాలో జరిగిన ప్రపంచకప్‌లో రజతం, ఆసియా కప్‌లో కాంస్యం, వరల్డ్ యూత్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించి తన సత్తా చాటింది. ఈ ఏడాది వరల్డ్ కప్, ఆసియా కప్‌లలోనూ పతకాలతో రాణించిన ఆమె, ఇప్పుడు జపాన్‌లో రెండు స్వర్ణాలను ముద్దాడి ఒలింపిక్స్‌లో దేశం తరఫున పతకంపై బలమైన ఆశలు రేకెత్తించింది.

హ్యాపీ జర్నీ.. ఆర్టీసీ, మెట్రో ఉమ్మడి పాస్ నేటి నుంచి అమలులోకి..



రూ.400 చెల్లిస్తే రోజంతా రెండు రవాణా వ్యవస్థల్లో ప్రయాణం
రూ.8,500 చెల్లిస్తే నెలవారీ పాస్ జారీ

హైదరాబాద్ సిటీ:(సామాన్యుడి అస్త్రం)

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా రవాణాలో సరికొత్త డిజిటల్ విప్లవాన్ని తీసుకొచ్చింది. ఆర్టీసీ, మెట్రోకి సంబంధించిన 'కామన్ మొబిలిటీ కార్డు' కోసం సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న హైదరాబాద్ నగరవాసులకు శుభవార్త చెప్పింది. శుక్రవారం నుంచి ఆయా రవాణా వ్యవస్థలకు చెందిన ఉమ్మడి పాస్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ప్రకటించింది. గాంధీ జయంతిని పురస్కరించుకుని బేగంపేట్‌లోని ప్రజాభవన్‌లో మధ్యాహ్నం 12 గంటలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు వెల్లడించింది.
హైదరాబాద్ మహా నగరంలో ప్రజారవాణా ఆవశ్యకత రోజురోజుకు పెరిగిపోతోంది. రోడ్లపై పెద్ద ఎత్తున నిలిచిపోతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని చాలామంది మెట్రో రైళ్లను ఆశ్రయిస్తున్నారు. అలాగే తక్కువ టికెట్ ధర కలిగిన ఆర్టీసీలో వివిధ అవసరాల నిమిత్తం ప్రయాణిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఇటు బస్సులు, అటు మెట్రోరైలులో తిరిగే తమకు ఒకే కార్డుతో సులువుగా రాకపోకలు సాగించే సౌకర్యాన్ని కల్పించాలని ప్రయాణికులు కొంతకాలంగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తద్వారా సమయం ఆదాతోపాటు ప్రయాణం ప్రశాంతంగా ఉంటుందని పేర్కొన్నారు.

మీ టికెట్ యాప్ ప్రారంభం

ఆర్టీసీ, మెట్రో ఉమ్మడి పాస్‌తోపాటు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్తగా మీ టికెట్ యాప్‌ను కూడా ప్రారంభిస్తోంది. సిటీ బస్సుల్లో ప్రయాణించే ప్యాసింజర్లకు కాగితపు టికెట్ల ఇబ్బందులు తప్పించేందుకు మీ టికెట్ యాప్ ద్వారా ఓపెన్ టికెటింగ్ విధానాన్ని తీసుకొస్తోంది.

డైనమిక్ క్యూఆర్ టికెట్

చెల్లింపు పూర్తయిన వెంటనే యాప్‌లో డైనమిక్ క్యూఆర్ కోడ్‌తో కూడిన డిజిటల్ టికెట్ జనరేట్ అవుతుంది. ప్రయాణ సమయంలో దీనిని బస్సులో చూపిస్తే సరిపోతుంది. కాగా, కాగిత టికెట్ల అవసరం లేకుండా పూర్తి పేపర్‌లెస్ ప్రయాణం సాధ్యమవుతుంది. నగదు చిల్లర సమస్యలకు ఈ విధానం ముగింపు పలుకుతుంది.
మీ టికెట్ యాప్-డిజిటల్ వీక్లీ బస్‌పాస్ రోజువారీ ప్రయాణికుల కోసం మీ టికెట్ యాప్‌లో ప్రత్యేకంగా డిజిటల్ వీక్లీ బస్ పాస్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఇందులో రూ.600 ధర ఉంటుంది. ఈ విధానం ద్వారా ప్రయాణికులు ఇకపై బస్ పాస్ సెంటర్లకు వెళ్లే అవసరం లేకుండా నేరుగా యాప్ నుంచే రూ.600 వారాంతపు పాస్‌ను కొనుగోలు చేయవచ్చు. ఈ పాస్ ద్వారా వారం రోజుల పాటు అన్ని బస్సుల్లో అపరిమిత ప్రయాణం చేయవచ్చు.

ఉమ్మడి పాస్‌లోని ముఖ్యాంశాలు

ఆర్టీసీ, మెట్రోకు కలిపి ఇస్తున్న పాస్‌ను అన్ని మెట్రో స్టేషన్లలో జారీచేస్తారు.ఒకే పాస్‌తో ఓఆర్ఆర్ లోపల నడిచే అన్ని రకాల ఆర్టీసీ సిటీ బస్సుల్లో (పుష్పక్ మినహా), మెట్రో రైళ్లలో ప్రయాణించవచ్చు.
మొదటిసారి కొనుగోలు చేసేటప్పుడు కార్డుకు రూ.100 వసూలు చేస్తారు. కార్డును తిరిగి ఇచ్చేటప్పుడు రూ.100 వాపస్ చేస్తారు.

ఇంటర్ ఫస్టియర్‌లో 20 శాతం ఇంటర్నల్ మార్కులు


హైదరాబాద్, అక్టోబరు 1 (సామాన్యుడి అస్త్రం)

ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం అన్ని సబ్జెక్టుల్లో ఇంటర్నల్ మార్కులు అమలు చేయనున్నారు. ఈ విషయాన్ని ఇంటర్ బోర్డు గతంలోనే ప్రకటించగా ఇంటర్నల్ పరీక్షల విధివిధానాలను గురువారం విడుదల చేసింది. ఇప్పటివరకు ఇంటర్ ద్వితీయ సంవత్సరంలోనే సైన్స్ గ్రూపుల్లో ప్రాక్టికల్స్ కొనసాగుతున్నాయి.గత ఏడాది తొలిసారి ఇంటర్-1 ఇంగ్లీషులో 20 ఇంటర్నల్ మార్కుల విధానం ప్రారంభించగా ఈసారి అన్ని సబ్జెక్టుల్లో అమలు చేయనున్నారు. ద్వితీయ భాష కన్నడం, తమిళం, మరాఠీ ఉన్నవారికి పాత విధానమే కొనసాగుతుందని అధికారులు తెలిపారు. విద్యార్థుల ప్రతిభను ప్రయోగ పరీక్షల ద్వారా కూడా గుర్తించాలన్న లక్ష్యంతో ఈ కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చామని ఇంటర్ బోర్డు కార్యదర్శి అభిలాష తెలిపారు.

డ్వాక్రా రుణంతో వ్యాపారం..

వాట్సాప్‌తో ఇంటికే సరుకులు!

రేపల్లెలో డ్వాక్రా మహిళ జేజమ్మతో సీఎం చంద్రబాబు ముఖాముఖి
డ్వాక్రా రుణంతో కిరాణా వ్యాపారం..
వాట్సాప్‌తో ఆర్డర్ల స్వీకరణ
'వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్' స్ఫూర్తిదాయకమన్న మహిళ
స్వయం ఉపాధితో మహిళలు ఎదగాలని సీఎం చంద్రబాబు పిలుపు
లబ్ధిదారునికి వృద్ధాప్య పింఛను అందజేసిన ముఖ్యమంత్రి



అమరావతి,అక్టోబర్ 1(సామాన్యుడి అస్త్రం)

స్వయం సహాయక సంఘాల ద్వారా లభించే రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో చిరు వ్యాపారాలు ప్రారంభించి, ఆధునిక సాంకేతికతను జోడించి వాటిని విస్తరించుకోవాలని ఆయన సూచించారు. బాపట్ల జిల్లా రేపల్లెలో నిర్వహించిన 'పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా' కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా, రేపల్లె పట్టణంలోని 4వ వార్డులో 'శ్రీలక్ష్మి కిరాణా జనరల్ స్టోర్' యజమాని జి. జేజమ్మతో పాటు ఇతర డ్వాక్రా మహిళలతో ముఖ్యమంత్రి ముఖాముఖి నిర్వహించారు. డ్వాక్రా గ్రూప్ బ్యాంక్ లింకేజీ ద్వారా రూ. 2 లక్షల రుణం పొంది, తన కిరాణా దుకాణాన్ని విస్తరించినట్లు జేజమ్మ ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. 'వన్ ఫ్యామిలీ--వన్ ఎంట్రప్రెన్యూర్' నినాదం తనకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని ఆమె పేర్కొన్నారు. వినియోగదారుల నుంచి వాట్సాప్ ద్వారా ఆర్డర్లు సేకరించి, తన భర్త శ్రీనివాసరావు సహాయంతో నేరుగా ఇళ్లకే డెలివరీ చేస్తున్నామని తెలపడంతో చంద్రబాబు వారి పనితీరును అభినందించారు. ఇదే క్రమంలో పలువురు డ్వాక్రా మహిళలు తమ వ్యాపార ఆలోచనలను, భవిష్యత్తు ప్రణాళికలను ముఖ్యమంత్రితో పంచుకున్నారు. వాట్సాప్ బిజినెస్ వినియోగంపై మహిళలకు ఉన్న అవగాహనను అడిగి తెలుసుకున్న చంద్రబాబు, నూతన వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవాలని వారికి దిశానిర్దేశం చేశారు. అనంతరం, జేజమ్మ మామగారైన వెంకటరావుకు ముఖ్యమంత్రి స్వయంగా వృద్ధాప్య పింఛను అందజేశారు. పర్యటన ముగింపులో ఆయన డ్వాక్రా మహిళలతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు.

రాయలసీమ దశ మార్చేలా గ్లోబల్ హార్టికల్చర్ హబ్..

లక్ష కోట్లతో బృహత్ ప్రణాళిక



రాయలసీమను ఫ్రూట్ బౌల్‌గా మార్చే గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం
రూ.1 లక్ష కోట్ల భారీ బడ్జెట్‌తో మూడు దశల్లో ప్రాజెక్టు అమలు
మదనపల్లెలో నిర్మల, చంద్రబాబు, పవన్ చేతుల మీదుగా పనుల ప్రారంభం
భారత్‌లోనే తొలి ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుకు శంకుస్థాపన
పది జిల్లాల్లో ఉద్యాన సాగు విస్తరణ.. 9.6 లక్షల మంది రైతులకు లబ్ధి

అమరావతి,అక్టోబర్ 1(సామాన్యుడి అస్త్రం)

రాయలసీమ రూపురేఖలను సమూలంగా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఒక బృహత్తర ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. ఈ ప్రాంతాన్ని దేశానికే 'ఫ్రూట్ బౌల్'గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' ఏర్పాటుకు అంకురార్పణ చేసింది. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ ప్రాజెక్టు పనులను లాంఛనంగా ప్రారంభించారు. సుమారు రూ. 1 లక్ష కోట్ల భారీ వ్యయంతో మూడు దశల్లో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ. 40,352 కోట్లు భరించనుండగా, ప్రైవేటు రంగం నుంచి రూ. 60,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. రాయలసీమ, ప్రకాశం ప్రాంతాల్లోని 10 జిల్లాలకు చెందిన 303 మండలాల్లో ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నారు.'విత్తనం నుంచి ఎగుమతి వరకు' (సీడ్ టు షిప్‌మెంట్) అనే సమగ్ర విధానంతో ఈ హబ్‌ను అభివృద్ధి చేయనున్నారు. దీని ద్వారా ప్రస్తుతం 8.41 లక్షల హెక్టార్లలో ఉన్న ఉద్యాన సాగును మరో 6 లక్షల హెక్టార్లకు విస్తరించాలని ప్రభుత్వం యోచిస్తోంది. వార్షిక ఉత్పత్తిని 222 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 435 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచడం ద్వారా సుమారు 9.6 లక్షల మంది రైతులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరనుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా సాగునీటి వనరులు, డ్రిప్ ఇరిగేషన్, రహదారుల అనుసంధానం, లాజిస్టిక్స్ వంటి కీలక మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించనుంది. మామిడి, అరటి, దానిమ్మ, టమాటాతో పాటు డ్రాగన్ ఫ్రూట్, అవకాడో వంటి విభిన్న తరహా పంటల సాగును కూడా ప్రోత్సహించనున్నారు.

దేశంలోనే తొలి ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్

ఈ కార్యక్రమంలో భాగంగా మదనపల్లెలోనే దేశంలోనే మొట్టమొదటి 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' (ఐఎస్ఏ) ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. పారిశ్రామిక రంగంలో 'ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్' (ఐఎస్‌బీ) తరహాలోనే, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే లక్ష్యంతో ఈ సంస్థ కార్యకలాపాలు సాగించనుంది. రిలయన్స్ సంస్థ భాగస్వామ్యంతో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మార్కెట్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక సాంకేతికతలను ఉపయోగించి ఈ సంస్థ రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తుంది. తద్వారా 'రైస్ బౌల్ ఆఫ్ ఇండియా'గా గుర్తింపు పొందిన ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పటంలో 'ఫ్రూట్ బౌల్'గా కూడా నిలపాలన్నది ప్రభుత్వ దృఢ సంకల్పంగా స్పష్టమవుతోంది.

కూతురు పొలిటికల్ ఎంట్రీ ప్రచారంపై మంత్రి నారాయణ క్లారిటీ

తన కూతురు షరణి మేయర్‌గా పోటీ చేయదని నారాయణ స్పష్టీకరణ
తన కుటుంబం నుంచి ఎవరూ రాజకీయాల్లోకి రారని వెల్లడి
ప్రజా సేవ చేయడానికే తాను రాజకీయాల్లోకి వచ్చానన్న మంత్రి

అమరావతి,అక్టోబర్ 1(సామాన్యుడి అస్త్రం)

తన కుమార్తె షరణి రాజకీయ ప్రవేశంపై వస్తున్న వదంతులకు ఆంధ్రప్రదేశ్ మంత్రి నారాయణ తెరదించారు. తన కుటుంబం నుంచి ఎవరూ రాజకీయాల్లోకి రారని, తన కుమార్తె మేయర్‌గా పోటీ చేస్తారంటూ జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు. నెల్లూరులో మీడియాతో మాట్లాడుతూ, ఈ ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేశారు. తనపై ఎన్ని ఆరోపణలు వచ్చినా తాను పట్టించుకోనని మంత్రి నారాయణ అన్నారు. "కామెర్ల రోగికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది" అంటూ తనపై విమర్శలు చేస్తున్న వారిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తాను ప్రజాసేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజలకు సేవ చేస్తూనే ఉంటానని తెలిపారు. అంతకుముందు, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి నారాయణ వివరించారు. గత రెండేళ్లలో రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో వేలాది మందికి శాశ్వత నివాస ధ్రువీకరణ పట్టాలు అందించామని చెప్పారు. నెల్లూరులో ఇప్పటికే 1,450 మందికి పట్టాలు ఇచ్చామని, త్వరలోనే మరో 1,250 మందికి అందిస్తామని హామీ ఇచ్చారు.



లోకేశ్‌పై రాజ్‌దీప్ సర్దేశాయ్ ప్రశంసలు..




కొచ్చిలో జరిగిన ఓ కార్యక్రమంలో లోకేశ్‌ను ఇంటర్వ్యూ చేసిన రాజ్‌దీప్
స్క్రిప్ట్ లేకుండా కఠిన ప్రశ్నలకు సూటిగా బదులిచ్చారని కొనియాడిన వైనం
చాలా స్పష్టంగా సమాధానాలు ఇచ్చారని ప్రశంస

అమరావతి,అక్టోబర్ 1(సామాన్యుడి అస్త్రం)

సీనియర్ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్.. ఆంధ్రప్రదేశ్ మంత్రి, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్‌పై ప్రశంసలు కురిపించారు. తాను చేసిన ఇంటర్వ్యూలో లోకేశ్ వ్యవహరించిన తీరును ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కఠినమైన ప్రశ్నలకు కూడా ఎలాంటి స్క్రిప్ట్ లేకుండా సూటిగా, స్పష్టంగా సమాధానాలు ఇచ్చారని కొనియాడారు.కొచ్చిలో జరిగిన ఇండియా టుడే సౌత్ కాంక్లేవ్‌లో రాజ్‌దీప్ సర్దేశాయ్.. మంత్రి లోకేశ్‌ను ముఖాముఖి ఇంటర్వ్యూ చేశారు. ఈ సందర్భంగా ఏపీ అభివృద్ధి, జాతీయ రాజకీయాలు, ఇతర అంశాలపై పలు ప్రశ్నలు సంధించారు. ఇంటర్వ్యూ చివరలో రాజ్‌దీప్ మాట్లాడుతూ... మీరు అడగబోయే ప్రశ్నల జాబితా ముందే ఇవ్వండి అని అడగని నాయకులను ఇంటర్వ్యూ చేయడం ఎప్పుడూ సులభంగా ఉంటుందని అన్నారు. ఈ ఇంటర్వ్యూపై లోకేశ్ సోషల్ మీడియా వేదికగా నిన్న స్పందించారు. ఈ చర్చలో దేశం గురించి, రాష్ట్రం గురించి, పాలన గురించి, భవిష్యత్ ప్రణాళికల గురించి మాట్లాడినట్టు వెల్లడించారు. ఎలాంటి స్క్రిప్ట్ అవసరం లేకుండానే రాజ్‌దీప్ అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చానని తెలిపారు.అందుకు రాజ్ దీప్ నేడు సోషల్ మీడియా ద్వారా స్పందించారు. ఇంటర్వ్యూలో అడిగే ప్రశ్నలపై గతంలో నాయకులందరూ ఇలాగే ఉండేవారని, కానీ ఇప్పుడు అది చాలా అరుదుగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో ఇతర నేతలు మిమ్మల్ని ఆదర్శంగా తీసుకుంటారని భావిస్తున్నాను అంటూ రాజ్‌దీప్ మంత్రి లోకేశ్ కు కితాబిచ్చారు.

ఏపీ స్థానిక ఎన్నికలపై హైకోర్టు కీలక తీర్పు..




స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించే జీవోల రద్దు
మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని హైకోర్టు స్పష్టీకరణ
ఆరు వారాల్లోగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వానికి ఆదేశం
వార్డుల పునర్విభజన, ఇతర అంశాలపై దాఖలైన పిటిషన్లను కొట్టివేసిన ధర్మాసనం

అమరావతి,అక్టోబర్ 1,(సామాన్యుడి అస్త్రం)

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నెలకొన్న ఉత్కంఠకు తెరదించుతూ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 104, 1065లను రద్దు చేసింది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదన్న సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఈ జీవోలు ఉల్లంఘిస్తున్నాయని స్పష్టం చేసింది. ఆరు వారాల్లోగా ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు ఇచ్చింది.స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారు, వార్డుల పునర్విభజన, ఎన్నికల వాయిదా తదితర అంశాలపై దాఖలైన పలు పిటిషన్లపై హైకోర్టు విచారణ చేపట్టింది. బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించడం వల్ల మొత్తం రిజర్వేషన్ల కోటా 50 శాతాన్ని దాటుతోందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్లు వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, రిజర్వేషన్లు 50 శాతం లోపే ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తూ సదరు జీవోలను కొట్టివేసింది.అదే సమయంలో ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం చేసింది. వార్డుల పునర్విభజన ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. 'సర్' ప్రక్రియ పూర్తయ్యాకే ఎన్నికలు జరపాలంటూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌తో పాటు, బీసీ జనాభా గణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాలను కూడా కోర్టు కొట్టివేసింది. గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సైతం తోసిపుచ్చింది.మొత్తం మీద ఎన్నికల ప్రక్రియను నిలిపివేయడానికి హైకోర్టు నిరాకరించింది. కేవలం రిజర్వేషన్ల శాతాన్ని మాత్రమే సమీక్షించాలని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో స్థానిక పోరుకు అడ్డంకులు తొలగిపోయాయి. అయితే, ఇప్పుడు ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో ఎలా ముందుకు వెళుతుంది? కోర్టు నిర్దేశించిన 50 శాతం పరిమితికి లోబడి కొత్త ఫార్ములాను ఎలా రూపొందిస్తుంది? అనేది ఆసక్తికరంగా మారింది. కోర్టు ఆదేశాల మేరకు ఆరు వారాల్లో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉండటంతో ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై ఒత్తిడి పెరిగింది.

లక్షలాది యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ

యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ
స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరించిన ప్రధాని
లక్షలాది మంది యువత ఆశయాలకు యూపీఎస్సీ ప్రతీక అని వ్యాఖ్య
సర్దార్ పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవలను స్మరించుకున్న ప్రధాని
భారత పైలట్ స్మిత్ ధైర్యాన్ని కొనియాడిన మోదీ



న్యూఢిల్లీ,అక్టోబర్1,(సామాన్యుడి అస్త్రం)

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) వందేళ్ల ప్రస్థానం లక్షలాది మంది యువత ఆకాంక్షలకు, దేశ ప్రజల నమ్మకానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూపీఎస్సీ శతాబ్ది స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌తో పాటు '100 ల్యాండ్‌మార్క్ జడ్జిమెంట్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. నిన్న జరిగిన ఒక విమాన ప్రమాద ఘటనలో అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శించిన భారత పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్ఛర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. "నిన్న జరిగిన ఘటనలో భారత పైలట్ కెప్టెన్ స్మిత్ చూపిన ధైర్యం, సమయస్ఫూర్తి, నిబద్ధత ప్రశంసనీయం. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లుగా, 9/11 తరహా ఘోర విషాదాన్ని ఒక భారతీయుడు అడ్డుకున్నాడు" అని మోదీ అన్నారు. స్మిత్ ఘనత మనందరికీ గర్వకారణమని, తాను ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడానని తెలిపారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న స్మిత్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని దేశ ప్రజలందరూ ప్రార్థించాలని పిలుపునిచ్చారు.యూపీఎస్సీ వందేళ్ల ప్రస్థానంపై మోదీ మాట్లాడుతూ.. "ఇది కేవలం ఒక సంస్థ వందేళ్లు పూర్తి చేసుకోవడం కాదు, ఇది లక్షలాది యువత ఆశయాల వేదుక. ప్రతి భారతీయుడు ఈ సంస్థపై ఉంచిన అచంచల విశ్వాసానికి ఇది నిలువుటద్దం. ఈ సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చిన ప్రతి ఒక్కరికీ నా అభినందనలు" అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సివిల్ సర్వీసుల చరిత్రను, మహనీయుల సేవలను మోదీ గుర్తుచేసుకున్నారు. "1920లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఈ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఆనాడు బ్రిటిష్ పాలన ఉన్నప్పటికీ ఆయన సంస్కృతంలో పేపర్ రాశారని ఇక్కడి గ్యాలరీలో చూశాను. అదేవిధంగా, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశాన్ని నడపడంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారు. స్వతంత్ర భారతానికి అవసరమైన 'ఉక్కు చట్రాన్ని' (స్టీల్ ఫ్రేమ్) సర్దార్ పటేల్ అందించారు. ఈ సంస్థను దేశానికి ఒక ప్రధాన స్తంభంగా తీర్చిదిద్దారు" అని మోదీ వివరించారు.1926 అక్టోబర్ 1న పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా ప్రారంభమైన ఈ సంస్థ, శతాబ్ద కాలంలో ఎన్నో మార్పులకు లోనై స్వతంత్ర రాజ్యాంగబద్ధ సంస్థగా రూపుదిద్దుకుందని ప్రధాని గుర్తుచేశారు. గతేడాది అక్టోబర్ 1న ప్రారంభమైన శతాబ్ది ఉత్సవాలు ఈ కార్యక్రమంతో ముగిశాయి. సెప్టెంబర్ 30, అక్టోబర్ 1 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో వివిధ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్మన్లు, సభ్యులు, కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు, విద్యావేత్తలు, యూపీఎస్సీ అధికారులు పాల్గొన్నారు.

'9/11 తరహా విషాదాన్ని అడ్డుకున్న భారతీయుడు'.. కెప్టెన్ స్మిత్‌పై మోదీ ప్రశంసలు



స్మిత్ అసాధారణమైన ధైర్యాన్ని ప్రదర్శించారని కితాబు
ఇప్పటికే స్మిత్‌ను 'హీరో'గా అభివర్ణించిన మోదీ
తీవ్ర విషాదాన్ని ఆపారంటూ నెతన్యాహు సైతం ప్రశంసలు
ప్రస్తుతం సౌదీలో చికిత్స పొందుతున్న స్మిత్
ఆయన పరిస్థితి నిలకడగా ఉన్నట్లు అధికారుల వెల్లడి

న్యూఢిల్లీ,అక్టోబర్1,(సామాన్యుడి అస్త్రం)

ఫ్లైదుబాయ్ విమానంలో పెను ప్రమాదాన్ని అడ్డుకున్న భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్ఛార్‌పై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. తీవ్రంగా గాయపడినా సమయస్ఫూర్తి, ధైర్యంతో వ్యవహరించి 9/11 తరహా విషాదాన్ని అడ్డుకున్నారని కొనియాడారు. గురువారం ఢిల్లీలో జరిగిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శతాబ్ది వేడుకల్లో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు."కెప్టెన్ స్మిత్ అసాధారణమైన సహనం, సమయస్ఫూర్తి, ధైర్యాన్ని ప్రదర్శించారు. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లు.. ఒక భారతీయుడు 9/11 తరహా విషాదాన్ని అడ్డుకున్నాడు" అని మోదీ పేర్కొన్నారు. అంతకుముందు కూడా స్మిత్‌ను 'హీరో'గా అభివర్ణించిన ప్రధాని.. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు బుధవారం బయలుదేరిన ఫ్లైదుబాయ్ ఎఫ్‌జెడ్1073 విమానంలో కాక్‌పిట్‌లో ఇద్దరు పైలట్ల మధ్య ఘర్షణ జరిగిన విషయం తెలిసిందే. ఇజ్రాయెల్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. స్మిత్ మచ్ఛార్‌పై దాడి చేసి కో-పైలట్ విమానాన్ని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో విమానం ఒక్కసారిగా భారీగా కిందకు దిగొచ్చింది. దాదాపు 17,000 అడుగుల ఎత్తు ఒక్క నిమిషంలోనే కోల్పోయినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ వివరాలు వెల్లడించాయి.తీవ్రంగా గాయపడిన స్మిత్ మచ్ఛార్ కాక్‌పిట్ తలుపు తెరిచేందుకు ప్రయత్నించడంతో ప్రయాణికులు, సిబ్బంది లోపలికి వెళ్లగలిగారు. అనంతరం దాడికి పాల్పడిన కో-పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. విమానాన్ని సౌదీ అరేబియాలోని తబూక్‌కు మళ్లించి సురక్షితంగా ల్యాండ్ చేశారు. విమానంలో 174 మంది ఉన్నారు.ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కూడా స్మిత్ ధైర్యాన్ని ప్రశంసించారు. ఆయన చర్యల వల్ల ప్రపంచవ్యాప్తంగా తీవ్ర విషాదానికి దారితీసే ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. స్మిత్ ప్రస్తుతం సౌదీ అరేబియాలో చికిత్స పొందుతున్నారు. ఆయన పరిస్థితి నిలకడగా ఉన్నట్లు భారత అధికారులు తెలిపారు.

125 ఏళ్ల రికార్డు బ్రేక్.. ఈశాన్య భారత్‌కు కనీవినీ ఎరుగని కరువు

ఈశాన్యంలో 125 ఏళ్లలో ఎన్నడూ లేనంత తక్కువ వర్షపాతం నమోదు
జూన్-సెప్టెంబర్ మధ్య రికార్డు స్థాయిలో వర్షపాత లోటు
అస్సాం, మేఘాలయ, అరుణాచల్‌లో నాలుగు నెలలుగా వర్షాభావం
సెప్టెంబర్‌లోనూ అధిక ఉష్ణోగ్రతలు.. ఆరో అత్యధికంగా రికార్డ్
దేశవ్యాప్తంగానూ ఈ ఏడాది సాధారణం కన్నా తక్కువ వర్షపాతం

న్యూఢిల్లీ,అక్టోబర్1,(సామాన్యుడి అస్త్రం)

ఈశాన్య భారతదేశం గత 125 ఏళ్లలో ఎన్నడూ లేనంత తీవ్రమైన వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో అత్యంత తక్కువ వర్షపాతం నమోదైనట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అధికారులు వెల్లడించారు. తూర్పు, ఈశాన్య భారతదేశంలో జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య కేవలం 1,017.1 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. 1901లో ఐఎండీ వర్షపాత రికార్డులను ప్రారంభించినప్పటి నుంచి ఈ ప్రాంతంలో ఇదే అత్యల్పమని అధికారులు స్పష్టం చేశారు.సాధారణంగా దేశంలోనే అత్యధిక వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో ఈశాన్య రాష్ట్రాలు ముందుంటాయి. కానీ ఈసారి అస్సాం, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్‌లలో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. రుతుపవనాల నాలుగు నెలల్లోనూ (జూన్, జులై, ఆగస్టు, సెప్టెంబర్) ఈ మూడు సబ్-డివిజన్లలో వర్షపాత లోటు కొనసాగడం ఆందోళన కలిగిస్తోంది. వ్యవసాయం, తాగునీరు, ఇతర ఆర్థిక కార్యకలాపాలకు పూర్తిగా నైరుతి రుతుపవనాలపైనే ఆధారపడే ఈ ప్రాంతంపై ఈ వర్షాభావం తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. సెప్టెంబర్ చివరి వారంలో అస్సాంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసినప్పటికీ, మొత్తం సీజన్‌లో ఏర్పడిన లోటును అది పూడ్చలేకపోయిందిదేశవ్యాప్తంగా చూసినా, ఈసారి రుతుపవనాల సీజన్ సాధారణం కంటే తక్కువ వర్షపాతంతోనే ముగిసింది. దేశవ్యాప్తంగా జూన్-సెప్టెంబర్ మధ్య 759.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇది 1901 తర్వాత 13వ అత్యల్prప వర్షపాతం కాగా, 2001 తర్వాత నాలుగో అత్యల్పం. అయితే, దేశంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఈశాన్యంలో వర్షపాత లోటు చాలా ఎక్కువగా ఉంది.వర్షాలు తగ్గడమే కాకుండా ఈశాన్యంలో సెప్టెంబర్ నెల అసాధారణంగా వెచ్చగా గడిచింది. తూర్పు, ఈశాన్య భారతదేశంలో సగటు ఉష్ణోగ్రత 27.95 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఇది సాధారణం కంటే 0.74 డిగ్రీలు ఎక్కువ.

25 మంది బీజేపీ ఎమ్మెల్యేలు మాతో టచ్ లో ఉన్నారు: అఖిలేశ్ యాదవ్



రాజ్యసభ ఎన్నికల వేళ యూపీలో ముదురుతున్న మాటల యుద్ధం
అఖిలేశ్ వ్యాఖ్యలకు బీజేపీ కౌంటర్
ఎస్పీ ఎమ్మెల్యేలే తమతో టచ్ లో ఉన్నారన్న కేశవ్ ప్రసాద్ మౌర్య

న్యూఢిల్లీ,అక్టోబర్1,(సామాన్యుడి అస్త్రం)

ఉత్తరప్రదేశ్‌లో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. రాజ్యసభ, అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, అధికార బీజేపీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారంటూ సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనికి బీజేపీ కూడా అంతే దీటుగా బదులిచ్చింది. ఎస్పీకి చెందిన 25 మంది ఎమ్మెల్యేలు తమతో సంప్రదింపులు జరుపుతున్నారంటూ యూపీ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య కౌంటర్ ఇవ్వడంతో రాజకీయం మరింత రసవత్తరంగా మారింది."చాలా మంది బీజేపీ ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారు. కానీ వారందరినీ పార్టీలో చేర్చుకోవడం కష్టంగా ఉంది. మేం నిలబెట్టుకోలేని హామీలు ఇవ్వదలచుకోలేదు" అని అఖిలేశ్ వ్యాఖ్యానించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పాత మిత్రులతోనే కలిసి పోటీ చేస్తామని, కాంగ్రెస్‌తోనూ పొత్తుల గురించి చర్చలు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ఇదే సమయంలో రామాలయ విరాళాల దొంగతనం ఘటనపై బీజేపీని విమర్శిస్తూ, విరాళాలు దొంగిలించి పెద్ద ఆర్థిక వ్యవస్థను నిర్మించలేరని ఎద్దేవా చేశారు.అఖిలేశ్ వ్యాఖ్యలపై కేశవ్ ప్రసాద్ మౌర్య తీవ్రంగా స్పందించారు. "సమాజ్‌వాదీ పార్టీకి చెందిన 25 మంది ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో ఎస్పీకి మేం పెద్ద షాక్ ఇస్తాం" అని ఆయన హెచ్చరించారు. మొత్తంమీద, యూపీలో 10 రాజ్యసభ స్థానాలకు అక్టోబర్ 16న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ ఆరోపణలు, ప్రత్యారోపణలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠను రేపుతున్నాయి.

2027 ఎన్నికలకు కొన్ని నెలలే.. పంజాబ్ కాంగ్రెస్ చీఫ్ రాజా వారింగ్ రాజీనామా!

కేసీ వేణుగోపాల్‌కు రాజీనామా లేఖ
24-48 గంటల్లో కొత్త అధ్యక్షుడి ప్రకటన!
పరిశీలనలో విజయ్ ఇందర్ సింగ్లా పేరు
పర్గత్ సింగ్, రంధావా పేర్లు కూడా చర్చలో
చన్నీ వర్గంతో విభేదాల నేపథ్యంలో మార్పు

న్యూఢిల్లీ,అక్టోబర్1,(సామాన్యుడి అస్త్రం)

పంజాబ్ కాంగ్రెస్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు అమరీందర్ సింగ్ రాజా వారింగ్ తన పదవికి రాజీనామా చేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) కేసీ వేణుగోపాల్‌కు రాజీనామా లేఖ అందించారు. కొత్త అధ్యక్షుడి పేరును 24 నుంచి 48 గంటల్లో ప్రకటించే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.2027 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలలే ఉన్న సమయంలో ఈ మార్పు జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. మాజీ మంత్రి విజయ్ ఇందర్ సింగ్లా పేరు ప్రధానంగా వినిపిస్తోంది. జలంధర్ కాంట్ ఎమ్మెల్యే పర్గత్ సింగ్, గురుదాస్‌పూర్ ఎంపీ సుఖ్‌జిందర్ సింగ్ రంధావా పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. మాజీ సీఎం చరణ్‌జిత్ సింగ్ చన్నీ పేరు కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం.రాజా వారింగ్ రాజీనామాకు పంజాబ్ కాంగ్రెస్‌లో చాలాకాలంగా కొనసాగుతున్న అంతర్గత విభేదాలు ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా వారింగ్ వర్గానికి, చరణ్‌జిత్ సింగ్ చన్నీ వర్గానికి మధ్య విభేదాలు పార్టీ కార్యక్రమాలు, సమావేశాల్లోనూ బయటపడ్డాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు కాంగ్రెస్ గతంలో వారింగ్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగిస్తూ.. చన్నీకి పార్టీ ప్రచార కమిటీ బాధ్యతలు అప్పగించింది. అయినా విభేదాలు పూర్తిగా సమసిపోలేదు.ఇటీవల పంజాబ్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టిన సచిన్ పైలట్ రాష్ట్ర నేతలు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. పార్టీ పరిస్థితి, అంతర్గత విభేదాలపై నివేదికను అధిష్ఠానానికి సమర్పించినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఈ నివేదిక తర్వాతే రాష్ట్ర నాయకత్వంలో మార్పుపై నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.రాజా వారింగ్ 2022 ఏప్రిల్‌లో పంజాబ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు ఆయన స్థానంలో కొత్త నాయకుడిని నియమించి, 2027 ఎన్నికలకు పార్టీని సిద్ధం చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తోంది.



ఒకప్పుడు ఇవి పేదల ఆహారం... ఇప్పుడు ఖరీదైన సూపర్ ఫుడ్స్!



ఒకప్పుడు చౌకగా దొరికిన ఆహార పదార్థాలు ఇప్పుడు సూపర్ ఫుడ్స్
ఆరోగ్యంపై పెరిగిన అవగాహన, మార్కెటింగ్ ప్రభావంతో అమాంతం పెరిగిన ధరలు
రాగులు, జొన్నలు, పప్పులు వంటివి సైతం గౌర్మెట్ ఫుడ్స్ జాబితాలోకి!
ఎముకల సూప్, సార్డైన్ చేపలు వంటివి ఖరీదైన హెల్త్ ఫుడ్స్‌గా ప్రాచుర్యం
సాధారణ ఆహారమే ఇప్పుడు సంపన్నుల డైట్‌లో లగ్జరీగా మారిన వైనం

కాలం మారింది, ఆహారపు అలవాట్లు మారాయి. ఒకప్పుడు పేద, మధ్యతరగతి ప్రజలు పూట గడవడానికి తినే సాధారణ ఆహార పదార్థాలు, ఇప్పుడు 'సూపర్ ఫుడ్స్' అనే ట్యాగ్‌తో లగ్జరీ వస్తువులుగా మారిపోయాయి. ఆరోగ్యంపై పెరిగిన స్పృహ, సోషల్ మీడియా ప్రభావం, గ్లోబల్ మార్కెటింగ్ మాయాజాలం కారణంగా వాటి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో తేలికగా దొరికే ఆహారమే నేడు నగరాల్లోని పెద్ద పెద్ద రెస్టారెంట్లు, హెల్త్ కేఫ్‌లలో ఖరీదైన వంటకంగా మెనూలో దర్శనమిస్తోంది.ఒకప్పుడు మన దేశంలో కరవు ప్రాంతాల్లోని రైతులు, సామాన్యులు ప్రధానంగా రాగులు, జొన్నలు, సజ్జల వంటి చిరుధాన్యాలపై ఆధారపడేవారు. వీటితో చేసిన సంకటి, అంబలి, రొట్టెలు వారి ఆకలి తీర్చేవి. కానీ ఇప్పుడు అవే చిరుధాన్యాలు ఫైబర్, మినరల్స్ పుష్కలంగా ఉన్నాయని తెలియడంతో గౌర్మెట్ సలాడ్లు, బ్రేక్‌ఫాస్ట్ బౌల్స్‌లో చోటు సంపాదించుకున్నాయి. అలాగే, ప్రతి భారతీయ ఇంటిలోనూ ఉండే పప్పుధాన్యాలు, శనగలు ఇప్పుడు 'ప్లాంట్-బేస్డ్ ప్రోటీన్'కు కేరాఫ్‌గా మారి ఖరీదైన సలాడ్స్‌లో భాగమయ్యాయి. సులభంగా పెరిగే చిలగడదుంప ఒకప్పుడు సామాన్యుడి ఆహారం కాగా, ఇప్పుడు యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ ఎ ఉన్నాయని ఫిట్‌నెస్ ప్రియులు ఇష్టంగా తింటున్నారు.ఈ మార్పు కేవలం మన దేశానికే పరిమితం కాలేదు. ఒకప్పుడు ఐరోపాలో పశువుల దాణాగా వాడిన ఓట్స్, ఇప్పుడు గుండె ఆరోగ్యానికి మేలు చేసే ఫైబర్ ఉందని తెలియడంతో ప్రపంచవ్యాప్తంగా బ్రేక్‌ఫాస్ట్‌లో భాగమైంది. పెరూ వంటి దేశాల్లోని రైతులు తినే క్వినోవా, ఇప్పుడు సంపూర్ణ ప్రోటీన్ ఉన్న ఆహారంగా అన్నానికి ప్రత్యామ్నాయంగా మారింది. దాని ధర సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయింది. మెక్సికోలో సర్వసాధారణంగా దొరికే అవకాడో, నేడు 'వెల్‌నెస్ కల్చర్'కు చిహ్నంగా, అత్యంత ఖరీదైన పండ్లలో ఒకటిగా నిలిచింది.ఇవే కాకుండా, ఒకప్పుడు ఆహారాన్ని వృథా చేయకుండా మిగిలిన ఎముకలతో తయారుచేసే 'బోన్ బ్రాత్' (ఎముకల సూప్) ఇప్పుడు కీళ్లు, చర్మ ఆరోగ్యానికి మంచిదని ప్రీమియం హెల్త్ డ్రింక్‌గా అమ్ముడవుతోంది. చౌకగా దొరికే సార్డైన్ చేపలు ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్ కోసం ఖరీదైనవిగా మారాయి. ఫ్రిజ్‌లు లేని కాలంలో ఆహారాన్ని నిల్వ చేసుకునేందుకు వాడిన పులియబెట్టే పద్ధతి (పెరుగు, కిమ్చి) ద్వారా తయారైన పదార్థాలు, ఇప్పుడు గట్ హెల్త్ (పేగుల ఆరోగ్యం) కోసం ప్రీమియం ఉత్పత్తులుగా అమ్ముడవుతున్నాయి. మొత్తంమీద, తరతరాలుగా మన పూర్వీకులు తింటూ వచ్చిన పోషకాహారం విలువను మనం ఆలస్యంగా గుర్తించాం. ఆరోగ్యంపై పెరిగిన అవగాహన మంచిదే అయినా, అదే సమయంలో మార్కెటింగ్ వ్యూహాల వల్ల ఒకప్పటి చౌక ఆహారం నేడు సంపన్నుల డైట్ చార్ట్‌కు పరిమితం కావడం గమనార్హం.

మనం రోజూ ఉపయోగించే ఈ 6 వస్తువులు క్యాన్సర్ కారకాలు అని తెలుసా?



ఇంట్లో రోజూ వాడే కొన్ని వస్తువులతో క్యాన్సర్ ముప్పు
ప్లాస్టిక్ డబ్బాలు, నాన్‌స్టిక్ ప్యాన్‌ల వాడకంలో జాగ్రత్తలు తప్పనిసరి
వాడిన నూనెను మళ్లీ మళ్లీ వేడి చేయడం అత్యంత ప్రమాదకరం
దీర్ఘకాలం పాటు తప్పుగా వాడటం వల్లే సమస్యలని నిపుణుల వెల్లడి
గాజు, స్టీల్ పాత్రల వాడకం సురక్షితమని వైద్యుల సూచన

మనం రోజూ ఇంట్లో వాడే కొన్ని వస్తువులు దీర్ఘకాలంలో మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని, క్యాన్సర్ వంటి వ్యాధులకు కూడా కారణం కావచ్చని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వీటిని ఒకసారి వాడినంత మాత్రాన ప్రమాదం లేకపోయినా, పదేపదే తప్పుగా ఉపయోగించడం వల్లే అసలు సమస్య మొదలవుతుందని స్పష్టం చేస్తున్నారు. 'మనీకంట్రోల్' కథనం ప్రకారం... మన ఇళ్లలో సాధారణంగా వాడే ఆరు వస్తువులతో జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

1. ప్లాస్టిక్ డబ్బాలు, బాటిళ్లు: ప్లాస్టిక్ డబ్బాలలో వేడి ఆహారాన్ని నిల్వ చేయడం లేదా మైక్రోవేవ్‌లో వేడి చేయడం వల్ల బీపీఏ (ద్రీఊ) వంటి హానికర రసాయనాలు, మైక్రోప్లాస్టిక్‌లు ఆహారంలో కలుస్తాయి. అదేవిధంగా, ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను ఎండలో ఉంచడం, ఎక్కువసార్లు వాడటం కూడా ఆరోగ్యానికి మంచిది కాదు.

2. నాన్‌స్టిక్ ప్యాన్‌లు: నాన్‌స్టిక్ ప్యాన్‌లను అధిక వేడి మీద వాడినప్పుడు లేదా వాటిపై గీతలు పడినప్పుడు హానికరమైన కణాలు విడుదలవుతాయి. ముఖ్యంగా పాతతరం ప్యాన్‌లలో వాడే పీఎఫ్ఏఎస్ (ళ్ళీఊఊ) రసాయనాలు ప్రమాదకరమైనవి.

3. అల్యూమినియం ఫాయిల్: పుల్లటి లేదా ఆమ్ల గుణం ఉన్న ఆహార పదార్థాలను అల్యూమినియం ఫాయిల్‌లో ఎక్కువసేపు చుట్టి ఉంచడం వల్ల అల్యూమినియం ఆహారంలోకి చేరే ప్రమాదం ఉంది.

మంచి ఆహారమే కదా అని అన్నీ తింటున్నారా? ఈ జబ్బులుంటే ప్రమాదమే!

సమతుల్య ఆహారం ఆరోగ్యానికి ఎంతో ముఖ్యం
అయితే వ్యాధిని బట్టి ఆహార నియమాలు మారతాయి
డయాబెటిస్, బీపీ ఉన్నవారు కొన్ని పదార్థాలు తినకూడదు
కిడ్నీ రాళ్లు, ఫ్యాటీ లివర్ ఉంటే ప్రత్యేక డైట్ అవసరం
సరైన ఆహార ఎంపికతోనే వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చు



సంపూర్ణ ఆరోగ్యానికి సమతుల్య ఆహారం పునాది లాంటిదని అందరికీ తెలుసు. అయితే, మనం తీసుకునే ప్రతి ఆహారం అందరిపైనా ఒకే రకమైన ప్రభావం చూపదు. కొన్ని రకాల ఆరోగ్య సమస్యలు ఉన్నప్పుడు, ఆరోగ్యకరమైనవిగా భావించే కొన్ని పదార్థాలు కూడా హాని కలిగించవచ్చు. వ్యాధిని బట్టి ఆహార నియమాలను జాగ్రత్తగా పాటించడం చికిత్సలో ఒక కీలకమైన భాగంగా వైద్యులు సూచిస్తున్నారు. సరైన ఆహారాన్ని ఎంచుకోవడం ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించుకోవచ్చు.ముఖ్యంగా మధుమేహం, అధిక రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధులతో బాధపడేవారు చాలా అప్రమత్తంగా ఉండాలి. మధుమేహం ఉన్నవారు స్వీట్లు, చక్కెర పానీయాలు, మైదా ఉత్పత్తులకు దూరంగా ఉండాలి. అధిక గ్లైసెమిక్ ఇండెక్స్ కారణంగా ఇవి రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను వేగంగా పెంచుతాయి. అలాగే, అధిక రక్తపోటు బాధితులు ఉప్పు, ప్యాకేజ్డ్ స్నాక్స్, ఊరగాయలు వంటి సోడియం అధికంగా ఉండే పదార్థాలను మానుకోవాలి. లేదంటే శరీరంలో నీరు నిల్వ ఉండి రక్తపోటు మరింత పెరిగే ప్రమాదం ఉంది.గుండె జబ్బులు ఉన్నవారు డీప్ ఫ్రైడ్ ఫుడ్స్, ప్రాసెస్ చేసిన మాంసం, బేకరీ పదార్థాలకు దూరంగా ఉండటం శ్రేయస్కరం. ఇవి చెడు కొలెస్ట్రాల్ (ఎల్డీఎల్)ను పెంచి, రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోవడానికి కారణమవుతాయి. ఇక కిడ్నీలో రాళ్ల సమస్య ఉన్నవారు పాలకూర, రాగి, జీడిపప్పు, డార్క్ చాక్లెట్ వంటివి తినకపోవడమే మంచిది. వీటిలో ఉండే ఆక్సలేట్లు, కాల్షియంతో కలిసి రాళ్లు ఏర్పడే ప్రమాదాన్ని పెంచుతాయి.గౌట్ సమస్యతో బాధపడేవారు రెడ్ మీట్, కొన్ని రకాల సముద్ర చేపలు, మద్యానికి దూరంగా ఉండాలి. వీటిలోని ప్యూరిన్లు శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిని పెంచి కీళ్ల నొప్పులు, వాపులకు దారితీస్తాయి. ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారు చక్కెర పానీయాలు, జంక్ ఫుడ్, మద్యపానాన్ని పూర్తిగా మానుకోవాలి. ఇవి కాలేయంలో కొవ్వు పేరుకుపోవడాన్ని ప్రోత్సహిస్తాయి. గ్యాస్ట్రిక్, యాసిడ్ రిఫ్లక్స్ ఉన్నవారు కారం, మసాలాలు, కాఫీ వంటివి తగ్గిస్తే ఉపశమనం లభిస్తుంది. హైపోథైరాయిడిజం సమస్య ఉన్నవారు గోయిట్రోజెన్లు ఉండే క్యాబేజీ, క్యాలీఫ్లవర్ వంటి ఆహారాలను వైద్యుల సలహా మేరకు పరిమితంగా తీసుకోవాలి. ఇవి థైరాయిడ్ హార్మోన్ల ఉత్పత్తిపై ప్రభావం చూపవచ్చు.కాబట్టి, ఆహారం విషయంలో మీ ఆరోగ్య పరిస్థితిని బట్టి ఏది తినాలో, ఏది తినకూడదో తెలుసుకోవడం చాలా ముఖ్యం. ఏవైనా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతుంటే, వైద్యులు లేదా డైటీషియన్ సలహా మేరకు ఆహార ప్రణాళికను రూపొందించుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

భోజనం తర్వాత 15 నిమిషాలు...

మీ ఆరోగ్యాన్ని మార్చే కీలక సమయం!



భోజనం తర్వాత మొదటి 15 నిమిషాలు ఆరోగ్యానికి చాలా ముఖ్యం
తిన్న వెంటనే కొద్దిసేపు నడవడం వల్ల అదుపులో రక్తంలో చక్కెర స్థాయిలు
భారత్‌లో 10 కోట్లకు పైగా మధుమేహులు ఉన్నారని చెబుతున్న నివేదికలు
జీర్ణవ్యవస్థపై ప్రభావం చూపే తిన్న వెంటనే పడుకోవడం, ఒత్తిడికి గురికావడం వంటివి
ఈ చిన్న మార్పులతో దీర్ఘకాలికంగా జీవక్రియ ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చంటున్న నిపుణులు

చాలా మందికి భోజనం అంటే కేలరీలు, కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్ల లెక్క మాత్రమే. కానీ, మనం తిన్న తర్వాత ఏం చేస్తామన్నది కూడా ఆరోగ్యంపై అంతే ప్రభావాన్ని చూపుతుంది. ముఖ్యంగా భోజనం చేసిన తర్వాత మొదటి 15 నిమిషాలు మన జీవక్రియ ఆరోగ్యానికి అత్యంత కీలకమైన సమయం. ఈ సమయంలో రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు పెరగడం మొదలవుతుంది, జీర్ణక్రియ చురుగ్గా మారుతుంది. ఈ తరుణంలో కొన్ని చిన్న చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా దీర్ఘకాలంలో అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.ప్రస్తుతం మన దేశం ప్రపంచంలోనే అత్యధిక మధుమేహ బాధితులు ఉన్న దేశాల్లో ఒకటిగా నిలుస్తోంది. అంతర్జాతీయ డయాబెటిస్ ఫెడరేషన్ ప్రకారం భారత్‌లో 10 కోట్లకు పైగా ప్రజలు మధుమేహంతో బాధపడుతున్నారు. మరో కోట్లాది మంది ప్రీ-డయాబెటిస్ దశలో లేదా వ్యాధి నిర్ధారణ కాకుండానే జీవిస్తున్నారు. భోజనం తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగడం అనేది గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచడమే కాకుండా, దీర్ఘకాలికంగా ఇతర ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది.

భోజనం తర్వాత ఏం చేయాలి?

ఆహారం తిన్న తర్వాత మన శరీరం స్పందించే తీరు మనం తీసుకునే ఆహారంపైనే కాకుండా ఆ తర్వాత మనం చేసే పనులపై కూడా ఆధారపడి ఉంటుంది. కొన్ని అలవాట్లు గ్లూకోజ్ వినియోగాన్ని, జీర్ణక్రియను మెరుగుపరిస్తే, మరికొన్ని అసౌకర్యాన్ని కలిగిస్తాయి. నిపుణులు సూచిస్తున్న కొన్ని సులభమైన అలవాట్లు ఇవే:

1. చిన్నపాటి నడక:

భోజనం చేసిన వెంటనే 10 నుంచి 15 నిమిషాల పాటు నెమ్మదిగా నడవడం ఎంతో మేలు చేస్తుంది. తేలికపాటి నడక వల్ల కండరాలు రక్తంలోని గ్లూకోజ్‌ను వేగంగా గ్రహిస్తాయి. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరగకుండా అదుపులో ఉంటాయి. ముఖ్యంగా డయాబెటిస్, ఇన్సులిన్ రెసిస్టెన్స్, ఊబకాయం వంటి సమస్యలు ఉన్నవారికి ఇది చాలా ప్రయోజనకరం. అయితే, తిన్న వెంటనే పరుగెత్తడం లేదా తీవ్రమైన వ్యాయామాలు చేయడం మంచిది కాదు. ఎందుకంటే అది జీర్ణవ్యవస్థ నుంచి కండరాలకు రక్త ప్రసరణను మళ్లించి, కడుపు నొప్పి లేదా వికారం వంటి సమస్యలకు దారితీయవచ్చు.

2. నిటారుగా కూర్చోవడం:

తిన్న వెంటనే పడుకోవడం లేదా వాలిపోవడం చాలా మందికి ఉండే అలవాటు. కానీ ఇది అత్యంత ప్రమాదకరం. ఇలా చేయడం వల్ల యాసిడ్ రిఫ్లక్స్, గుండెల్లో మంట, ఆహారం పైకి తన్నడం వంటి సమస్యలు వస్తాయి. నిటారుగా కూర్చోవడం ద్వారా గురుత్వాకర్షణ శక్తి వల్ల ఆహారం జీర్ణవ్యవస్థలో సజావుగా కిందికి వెళ్తుంది.

3. మితంగా నీరు, ఒత్తిడికి దూరం:

భోజనం తర్వాత నీరు తాగడం జీర్ణక్రియకు సహాయపడుతుంది. అయితే, ఒకేసారి అతిగా నీరు తాగడం వల్ల జీర్ణరసాలు పలుచబడి జీర్ణక్రియ నెమ్మదించే అవకాశం ఉంది. దాహాన్ని బట్టి మితంగా నీరు తాగడం ఉత్తమం. అలాగే, తిన్న వెంటనే పని ఒత్తిడికి గురికావడం లేదా స్క్రీన్ చూడటం వంటివి ఒత్తిడి హార్మోన్లను పెంచుతాయి. ఇవి పరోక్షంగా గ్లూకోజ్ నియంత్రణపై ప్రభావం చూపుతాయి. కాబట్టి, భోజనం తర్వాత కొద్దిసేపు ప్రశాంతంగా గడపడం మంచిది.ఈ చిన్న మార్పులు టైప్ 2 డయాబెటిస్, ప్రీ-డయాబెటిస్, ఊబకాయం, పీసీఓఎస్ వంటి సమస్యలతో బాధపడేవారికి మరింత ముఖ్యం. భోజనం తర్వాత పదేపదే పెరిగే చక్కెర స్థాయిలు దీర్ఘకాలంలో రక్తనాళాలు, నరాలు, మూత్రపిండాలు, కళ్లు, గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. ఈ సులభమైన అలవాట్లకు ప్రత్యేక పరికరాలు, అదనపు ఖర్చు లేదా ఎక్కువ సమయం అవసరం లేదు. ప్రతిరోజూ అల్పాహారం, భోజనం, రాత్రి భోజనం తర్వాత వీటిని పాటించడం ద్వారా జీవక్రియ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకుని, దీర్ఘకాలికంగా ఆరోగ్యంగా జీవించవచ్చు.

ఉదయం నిద్రలేవగానే నీళ్లు ఎందుకు తాగాలి?

ఉదయం నిద్రలేవగానే చాలామందికి ముందుగా టీ లేదా కాఫీ తాగే అలవాటు ఉంటుంది. అయితే ఖాళీ కడుపుతో టీ లేదా కాఫీ తాగడం కంటే ఒక గ్లాసు నీరు తాగడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు.శరీరానికి తక్షణ శక్తి అందుతుందిరాత్రంతా నీరు తాగకుండా ఉండటం వల్ల ఉదయం కొంత నీరసం లేదా అలసటగా అనిపించవచ్చు. నిద్రలేవగానే ఒక గ్లాసు నీరు తాగితే శరీరానికి తేమ అందడంతో పాటు ఉత్సాహంగా అనిపిస్తుంది.

జీర్ణక్రియకు తోడ్పడుతుంది

ఉదయం నీరు తాగడం వల్ల జీర్ణవ్యవస్థ చురుకుగా పనిచేయడం ప్రారంభిస్తుంది. దీంతో ఆహారం సులభంగా జీర్ణమయ్యే అవకాశం ఉంటుంది.

బరువు నియంత్రణ

ఖాళీ కడుపుతో నీరు తాగడం వల్ల కడుపు నిండిన భావన కలగవచ్చు. దీంతో ఆహారం తక్కువగా తీసుకునేందుకు అవకాశముంటుంది. అలాగే శరీర జీవక్రియకు కూడా కొంత మేలు చేస్తుంది. అయితే బరువు తగ్గాలంటే ఆహార నియంత్రణ, వ్యాయామం కూడా తప్పనిసరి.

మా తెల్ల కాగితం అలాంటి తల్లిదండ్రులకు అంకితం

హర్ష్ రోషన్, నక్షత్ర జంటగా నటిస్తున్న తాజాచిత్రం ‘తెల్లకాగితం()’. రమేశ్ బండ్రెడ్డి దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే, మాటలు నందు సవిరిగాన అందించారు. కే శ్రీదేవి సమర్పణలో అరుణాచల క్రియేషన్స్ బ్యానర్‌పై కృష్ణ కొమ్మాలపాటి నిర్మించారు. అక్టోబర్ 2న విడుదల కానున్న ఈ మూవీ ప్రీరిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో జరిగింది. ఈ వేడుకకు ప్రముఖ నిర్మాత, టీఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు, స్టార్ డైరెక్టర్లు అనిల్ రావిపూడి, కొరటాల శివ, చందు మొండేటి, వశిష్ఠ, శైలేష్ కొలను, రామ్ జగదీశ్, నిర్మాత బండ్ల గణేశ్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా హీరో హర్ష రోషన్ మాట్లాడుతూ.. “ఈ వారం రోజుల్లో నేను రెండు షాక్‌లు చూశాను. మొదటిది పాన్ ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్ మా ట్రైలర్ గురించి పోస్ట్ చేసి మాకు కొండంత ధైర్యం ఇవ్వడం, రెండోది సినిమా విడుదలకు మూడు రోజుల ముందు మా చిత్రం నుంచి ఒక వీడియో లీక్ కావడం. ఆ లీక్ అయిన వీడియోపై వచ్చిన ప్రతి మీమ్, ట్వీట్, రీల్ చూశాను.



ఇళయరాజా కాపీరైట్ వివాదం..

ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా(కు సుప్రీంకోర్టు(లో ఎదురుదెబ్బ తగిలింది. ‘మూడు పాని’ సినిమాలోని ‘ఎన్ ఇనియ పొన్ నిలవే’ పాట కాపీరైట్) వ్యవహారంలో అత్యున్నత నాయస్థానంలో ఆయనకు వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. ఈ కాపీరైట్ వివాదానికి సంబంధించి ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది.గతంలో ఈ వ్యవహారంపై ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ధర్మాసనం సంపూర్ణంగా సమర్థించింది. ఒక పాట రూపుదిద్దుకోవడంలో వివిధ వ్యక్తుల పాత్రలు వేర్వేరుగా ఉంటాయని, అందువల్ల సంగీత దర్శకుడికి కేవలం ఆయన స్వరపరిచిన బాణీపై మాత్రమే హక్కులుంటాయని న్యాయస్థానం స్పష్టం చేసింది.



అమితాబ్‌కు ప్రమాదం



బాలీవుడ్ దిగ్గజ నటుడు అమితాబ్ బచ్చన్‌కు ‘కౌన్ బనేగా కరోడ్‌పతి 18’) షూటింగ్‌లో అనుకోని ప్రమాదం ఎదురైంది. షూటింగ్ సమయంలో ఆయన ప్రమాదవశాత్తు జారిపడటంతో ఎడమ మోకాలికి గాయం(అయింది. ఈ విషయాన్ని స్వయంగా అమితాబ్ బచ్చన్ తాజా ఖదీజ ఎపిసోడ్‌లో ప్రేక్షకులతో పంచుకున్నారు. సాధారణంగా ఎపిసోడ్‌ను(ఉత్సాహంగా స్టేజ్‌పై నిలబడి ప్రారంభించే బిగ్ బీ.. ఈసారి మాత్రం కూర్చునే తన ప్రారంభ ప్రసంగాన్ని కొనసాగించారు. దీనిపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొనగా, అసలు కారణాన్ని ఆయనే వివరించారు. షూటింగ్ సమయంలో జారిపడి మోకాలికి గాయం కావడంతో కొంతసేపు నిలబడటంలో ఇబ్బంది కలుగుతోందని తెలిపారు.అయితే అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అమితాబ్ స్పష్టం చేశారు.

అందుకే బోల్డ్ సీన్స్‌కు ఒప్పుకున్నా!

దక్షిణాది చిత్రసీమలో తనదైన నటనతో గుర్తింపు తెచ్చుకున్న అమలా పాల్(ప్రస్తుతం వ్యక్తిగత జీవితాన్ని గడుపుతోంది. కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉంటున్న ఈ భామ తాజాగా ఓ ఈవెంట్లో పాల్గొన్నది. ఈ సందర్భంగా ఆమె చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఈ సందర్భంగా అమలా పాల్ దక్షిణాది చిత్ర పరిశ్రమలో హీరోయిన్లను సరిగ్గా చూపించడం లేదనే విమర్శలపై స్పందిస్తూ.. అందుకు ఇండస్ట్రీ మొత్తానిన నిందించడం కరెక్ట్ కాదని అభిప్రాయాన్ని వ్యక్తపర్చింది.“కొన్ని సినిమాల్లో మహిళలను చూపించే విధానం సరిగ్గా లేకపోవడానికి చిత్రపరిశ్రమ కారణం కాదు, అది కేవలం ఆ సినిమా టీమ్ లేదా ఆ దర్శకుడి ఆలోచనా లోపం అయి వుండొచ్చు.




‘గీతాంజలి’ రీ-రిలీజ్ డేట్ ఫిక్స్

అక్కినేని నాగార్జున కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచిపోయిన క్లాసిక్ రొమాంటిక్ డ్రామా ‘గీతాంజలి’ రీ-రిలీజ్‌కు తేదీ ఖరారైంది. ఈ చిత్రాన్ని 4ఖ డిజిటల్ వెర్షన్‌లో నవంబర్ 13న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు అన్నపూర్ణ స్టూడియోస్ అధికారికంగా ప్రకటించింది. గతంలో ఈ చిత్రాన్ని నాగార్జున పుట్టినరోజు సందర్భంగా ఆగస్టు 28న విడుదల చేయాలని ప్లాన్ చేశారు. అయితే, పిక్చర్, సౌండ్ క్వాలిటీని మరింత మెరుగుపరిచేందుకు అదనపు పునరుద్ధరణ పనులు అవసరం కావడంతో విడుదల వాయిదా పడింది. చాలా కాలంగా ఎదురుచూస్తున్న అభిమానులకు చిత్రబృందం ఇప్పుడు కొత్త తేదీతో స్పష్టత ఇచ్చింది. 1989లో విడుదలైన ‘గీతాంజలి’ అప్పట్లో ఓ సంచలనం. ప్రముఖ దర్శకుడు మణిరత్నం తెలుగులో నేరుగా దర్శకత్వం వహించిన ఏకైక చిత్రం ఇదే కావడం విశేషం. నాగార్జున–గిరిజ ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీతో పాటు ఇళయరాజా సంగీతం, పీసీ శ్రీరామ్ సినిమాటోగ్రఫీ ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయి. దాదాపు 37 ఏళ్ల తర్వాత ఈ క్లాసిక్ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో 4ఖ టెక్నాలజీతో మళ్లీ పెద్ద తెరపైకి తీసుకురానున్నారు. శ్రీ పద్మిని సినిమాస్ ఈ చిత్రాన్ని పంపిణీ చేయనుంది.టాలీవుడ్‌లో ఎవర్‌గ్రీన్ ప్రేమకథా చిత్రంగా గుర్తింపు తెచ్చుకున్న ‘గీతాంజలి’ మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. నాగార్జున హీరోగా, మణిరత్నం దర్శకత్వంలో తెరకెక్కిన ఈ క్లాసిక్ మూవీని నవంబర్ 13న రీ-రిలీజ్ చేయనున్నట్లు అన్నపూర్ణ స్టూడియోస్(అధికారికంగా ప్రకటించింది. మరణానికి దగ్గరవుతున్న ఇద్దరు ప్రేమికుల మధ్య సాగే భావోద్వేగభరితమైన కథతో తెరకెక్కిన ‘గీతాంజలి’ అప్పట్లో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సినిమా నాగార్జున కెరీర్‌లో బ్లాక్‌బస్టర్()గా నిలిచింది.ముఖ్యంగా సినిమాలోని పాటలు ఇప్పటికీ సంగీత ప్రియులను అలరిస్తూనే ఉన్నాయి.



‘ది కోర్ట్’ (జియో హాట్ స్టార్) సిరీస్ రివ్యూ!

యోగలక్ష్మికి సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ ఉంది. ‘టూరిస్ట్ ఫ్యామిలీ’ సినిమా .. ‘హార్ట్ బీట్’ సిరీస్ లో ఆమె చేసిన పాత్రలు అందుకు కారణంగా చెప్పుకోవచ్చు. ‘హార్ట్ బీట్’లో యోగలక్ష్మి చేసింది నెగెటివ్ షేడ్స్ తో కూడిన పాత్ర. అయినప్పటికీ ఆకర్షణీయమైన ఆమె కళ్లు అందరినీ కట్టిపడేశాయి. అలాంటి యోగలక్ష్మి ప్రధానమైన పాత్రగా రూపొందిన సిరీస్ గా ‘ది కోర్ట్’ కనిపిస్తుంది. తమిళంలో రూపొందిన ఈ సిరీస్ నుంచి ఇంతవరకూ 16 ఎపిసోడ్స్ ను వదిలారు. తెలుగులోను అందుబాటులో ఉన్నాయి. ‘యాలిని’ (యోగలక్ష్మి) ‘లా’ పూర్తి చేస్తుంది. సిటీకి చేరుకుని అక్కడ తన స్నేహితులు ఉండే పీజీలో దిగుతుంది. హైకోర్టులో జూనియర్ గా అవకాశాన్ని సంపాదించుకోవడానికి ప్రయత్నాలు మొదలెడుతుంది. ‘బార్’ ఎలక్షన్స్ దగ్గర



పడటంతో, హై కోర్టులో సీనియర్ న్యాయవాదుల మధ్య కోల్డ్ వార్ నడుస్తూ ఉంటుంది. ఈ నేపథ్యంలోనే తనకి ఛాంబర్ లేకుండా చేసిన ‘వేణి చంద్రకాంత్’ (ముక్తా జార్జ్) పై అడ్వకేట్ దేవా (అర్జున్ శ్యామ్) అసహనంతో ఉంటాడు. ఆమె ఛాంబర్ ను షేర్ చేసుకోవాలనే పట్టుదలతో ఉంటాడు. ‘వేణి’ ఆ కోర్టులో 15 ఏళ్లుగా అడ్వకేట్ గా పనిచేస్తూ ఉంటుంది. ఆమె దగ్గర ముత్తు .. విశ్వ .. కీర్తన జూనియర్స్ గా ఉంటారు. ఆ కోర్టుకి సంబంధించిన క్యాంటీన్ ను వేణి భర్త ‘సత్య’ నడుపుతూ ఉంటాడు. ఆ కోర్టు ఆవరణలో ఎవరు అడుగుపెట్టినా క్యాంటీన్ నడుపుతున్న సత్యకి .. ‘టీ’లు మోసే ‘సుడాలి’కి తెలిసిపోతుంది.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.